




అమరావతికి మళ్లీ అంకురార్పణ

- రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా పూజలతో రాయపూడి వద్ద పనుల ప్రారంభం
- రైతుల హర్షధ్వానాల మధ్య సీఎం చంద్రబాబు భూమిపూజ
- మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేసింది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన ఐదో నెలలోనే తిరిగి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అడివిలా మార్చిన రాజధాని ప్రాంతంలో తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు రాజధాని అంతటా పర్యటించారు. నిలిచిపోయిన పనులను పరిశీలించి వాటిని ఎలా తిరిగి పట్టాలెక్కించాలనే దానిపై అవగాహనకు వచ్చారు. మరోవైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ అమరావతిలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి బాటలు వేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమరావతి పనులు ప్రారంభిస్తారని రాజధాని ప్రాంత ప్రజలే కాకుండా రాష్ట్రమంతటా ఎదురు చూస్తున్న క్రమంలో శనివారం సీఎం చంద్రబాబునాయుడు అమరావతి పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. ప్రజల హర్షధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా పూజలతో రాజధాని పనులను ప్రారంభించారు. రాయపూడి వద్ద జీ ప్లస్ 7 విధానంలో నిర్మించతలపెట్టిన సీఆర్డీయే కార్యాలయం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోగా దాని నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు పునః ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. అమరావతిలో రూ.160 కోట్లతో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తున్నామని దీనిని 121వ రోజున ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానన్నారు. రైతులకు కౌలు పెండింగ్ నిధులు 170 కోట్లు ఇచ్చామని, రూ.225 కోట్లు త్వరలో ఇస్తామన్నారు.



రాజధాని పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు



రాజధాని మ్యాప్‌ను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీఆర్డీఏ అధికారులు

విధ్వంసం పోయి.. నిర్మాణం ప్రారంభం

1631 రోజులు పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారని చంద్రబాబు తెలిపారు. విధ్వంసం పోయింది.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిలిచిన పనుల వల్ల రూ.7 వేల కోట్లు అదనంగా భారం పడుతోందన్నారు. రూ.52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామని, కేంద్రం రూ.15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చిందన్నారు. 8,603 కి.మీ సీఆర్డీయే, 217 చ.కిమీ పరిధిలో రాజధాని, 16.9 చ.కి పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుందన్నారు. అమరావతిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలని సీఆర్డీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, ఎస్పీ సతీష్‌కుమార్, రైతు నాయకులు పువ్వాడ సుధాకరరావు జోజాల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవిలా రాజధాని మహిళలు

అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేశామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం కోసం రైతులు భూములు ఇస్తే గడిచిన ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. రాజధాని ఉద్యమ సమయంలో ఇక్కడి మహిళలు రాణీరుద్రమ దేవిలా పోరాడారన్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమం చేపడితే అన్నం తిననివ్వకుండా అడగడుగునా వేధించారన్నారు. ఈ పవిత్రమైన పుణ్యభూమిని మహిళ శక్తి కాపాడిందని తెలిపారు. ఎంతమంది రాక్షసులు వచ్చినా అమరావతిని కాపాడిన చరిత్ర రైతులదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిపై విష ప్రచారం చేసిందన్నారు. ముంపు ఎడారి అన్న జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ మునిగిందన్నారు. దేవుడు స్క్రిప్ట్ అంటే ఇదేనని చంద్రబాబు తెలిపారు.

మగువ మేలుకో.. తెలుసుకో



- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

8లో

నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల



పేదలపై ఫీజుల పిడుగు

- ▼ విద్యా హక్కు చట్టం ప్రవేశాలకు బ్రేక్
- ▼ ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా తీర్పు
- ▼ ఫీజులు చెల్లించాలని యాజమాన్యాల ఒత్తిడి
- ▼ ఆందోళనలో తల్లిదండ్రులు.. స్పష్టత ఇవ్వని విద్యాశాఖ
- ▼ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500పైగా ఆర్టీఈ విద్యార్థులు

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా తయారైంది. ఇప్పటికే విద్యా సంవత్సరం సగం గడిచింది. ఈ సమయంలో ఆర్టీఈ ప్రవేశాలపై ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లకు సంబంధించి గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 24ను ఇటీవల హైకోర్టు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయి. న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు వచ్చి రెండు రోజులు కాకముందే ప్రైవేటు యాజమాన్యాలు తమ ఫీజులపై జులుం ప్రదర్శిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విద్యా హక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందిన 1500 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు. వీరిలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారు. మరింత ఆందోళన కరమైన విషయం ఏమి టంటే హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు కూడా వీరిలో ఉన్నారు. ఆయా వర్గాలు వేలకువేలు ఫీజులు చెల్లించుకోలేరు. అయినా విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఆ చట్టాన్ని కోర్టు రద్దు చేయడంతో పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. అంతంత ఫీజులు కట్టే స్థితిలో చాలామంది తల్లిదండ్రులు లేరు. ఫీజులు కట్టకపోతే అడ్మిషన్లు రద్దు చేస్తామని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. విద్యా సంవత్సరం సగంలో పిల్లల్ని వేరే పాఠశా లలో చేర్పించే అవకాశం లేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఫీజులపై యాజమా న్యాల ఒత్తిళ్లు.. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆందోళనలో ఉన్నా విద్యా శాఖ మౌనంగా ఉంది. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే విషయంలో విద్యాశాఖ అనేకసార్లు ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకారం పలు కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల్ని అధికారులు చేర్పించారు. తాజాగా జీవో రద్దు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. యాజమా న్యాలు కోరినట్లు ఇప్పటికిప్పుడు వేలాది రూపాయల ఫీజులు చెల్లించాలంటే తమవల్లకాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీ ఈ కింది చేరిన విద్యార్థులకు ఆయా పాఠశాలలను బట్టి రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఫీజులు నిర్దేశించాయి. తొలి విడత దీపావళిలోపు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రుల్ని వ్యక్తిగతంగా పాఠశాలలకు పిలిచి ఫీజులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. నాటి వైసీపీ ప్రభుత్వం కనీసం విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష కూడా నిర్వహించకుండా ఈ జీవోను తీసుకువచ్చింది. దీంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇని స్టిట్యూషన్స్ ఫెడరేషన్(యూపీఈఐఎఫ్)గా ఏర్పడి న్యాయస్థానా న్ని ఆశ్రయించారు. తాజాగా న్యాయస్థానం ప్రైవేటు స్కూల్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఫలితంగా ఆర్టీఈ ద్వారా చేరిన పేద కుటుంబాల పిల్లలపై పిడుగు ప డినట్లు అయింది.



అమరావతి రైలుకు భూసేకరణ

- కార్యకలాపాలకి రైల్వే శాఖ టెండర్ నోటిఫికేషన్
- రూ.76.68 లక్షల పనిని ఏజెన్సీకి కేటాయించేందుకు నిర్ణయం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి నూతన రైలుమార్గాన్ని సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని రైల్వే శాఖ భావిస్తున్నది. భూసేకరణ ప్రక్రియని సులభతరం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా రూ.76 లక్షల 68 వేల 373కి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 29న బిడ్డింగ్ ప్రారంభించి నవంబరు 12న ముగించి ఏజెన్సీని ఖరారు చేయనుంది. ఎర్రుపాలెం - నంబూరు వయా అమరావతి 56.53 కిలోమీటర్ల పొడవునా రైలుమార్గాన్ని రాబోయే మూడు నాలుగేళ్లలోనే పూర్తి చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే భూసేకరణ ఏ గ్రామాల్లో చేపట్టాలనే వివరాలను యంత్రాంగానికి నివేదించింది. సాదారణంగా రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ కాంపిటెంట్ అథారిటీగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి బాధ్యతలు కేటాయిస్తారు. అయితే అమరావతి నూతన రైలుమార్గం ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యం కలిగినది కావడంతో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏబీ తేజకు కాంపిటెంట్ అథారిటీ బాధ్యతలను ఇటీవలే కేటాయించారు. సర్వే నెంబర్ల వారీగా భూముల సేకరణ కోసం ప్రస్తుతం రికార్డువర్కు జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు కోసం ఇటు గుంటూరు, కృష్ణానదికి అవతలివైపున ఎన్‌టీఆర్ కృష్ణా, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోనూ భూసేకరణ చేయాల్సి ఉన్నది. ఇందుకోసం ఫెసిలిటేషన్ బాధ్యతలను ఒక ఏజెన్సీకి అప్పగిస్తే భూసేకరణ ప్రక్రియ సులభతరంగా రెవెన్యూవర్గాలు పూర్తి చేయగలవన్న అభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. ప్రస్తుతానికి రైల్వే శాఖ సింగిల్ లేన్ మార్గాన్ని నిర్మించనున్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు వరసల మార్గానికి భూమి ఎంతైతే అవసరం అవుతుందో అంత విస్తీర్ణంలో భూసేకరణ చేపడుతుందని తెలిపాయి.

విజయవాడకు బైపాసు మార్గంగా..


ఎర్రుపాలెం - అమరావతి రాజధాని - నంబూరు రైలుమార్గం విజయవాడ జంక్షన్‌కు బైపాసు లైన్‌గా ఉపయోగపడనుంది. ప్రస్తుతం విజయవాడ జంక్షన్ రద్దీగా మారిన దృష్ట్యా సికింద్రాబాద్, బోపాల్ వైపు నుంచి వచ్చే రైళ్లు ఈ మార్గం మీదగా నంబూరుకు మళ్లించి అక్కడి నుంచి న్యూగుంటూరు మీదగా తెనాలికి చేర్చి ఆ తర్వాత మెయిన్‌లైన్‌లోకి తీసుకెళ్లొచ్చు. మరోవైపు గుంటూరు - నంద్యాల మీదగా ఒకమార్గం రేణిగుంటకు చేర్చవచ్చు.



శంకర్‌విలాస్ ఆర్వోబీ నమూనా సిద్ధం

- ◆ 1.46 కి.మీ. పొడవు.. 139 భవనాలపై ప్రభావం
- ◆ డిజైన్‌కు సాంకేతిక అనుమతి రాగానే భూసేకరణ

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ రైల్వే వోవర్ బ్రిడ్జి నమూన విడుదలైంది. శనివారం రోడ్లు, భవనాల శాఖ నుంచి బ్రిడ్జి డిజైన్ విడుదలైంది. ఎక్కడి నుంచి ప్రారంభమై ఎక్కడ వరకు నిర్మిస్తారు.. సర్వీసు రోడ్లు, పొడవు, ఏ భవనాలను తొలగించాలి వంటివన్నీ ఈ నమూనలో నిక్షిప్తం చేశారు. బ్రిడ్జికి ఇరువైపులా కలుపుకుని 139 భవనాల్లో కొన్నింటిని పూర్తిగా, కొన్నింటిని కొంత మేరకు తొలగించాల్సి వస్తుంది. ఈ డిజైన్‌కు సాంకేతిక అనుమతి రాగానే భూసేకరణ ప్రక్రియని ప్రారంభిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. ట్రాఫిక్ రద్దీ అధికమవడంతో నగర ప్రజలు దశాబ్దాల తరబడి శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణ కోసం ఎదురు చూస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ బ్రిడ్జిని నాలుగు వరసలుగా చేస్తామని ఎన్నికల్లో చెప్పి తీరా గెలిచాక గత పాలకులు విస్మరించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టు వదలకుండా సాధించారు. ఈ క్రమంలో బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన సన్నాహక పనులు మొదలయ్యాయి. 1.46 కిలోమీటర్ల పొడవునా నూతన బ్రిడ్జిని ప్రతిపాదించారు. రెండు వైపులా 30 అడుగుల వెడల్పుతో సర్వీసు రోడ్లు, ఆర్‌వోబీపై క్యారేజ్ వేని 60 అడుగులుగా ప్రతిపాదన చేశారు. సెంట్రల్ డివైడర్‌ని కూడా నిర్మిస్తారు. బ్రిడ్జికి తూర్పు వైపున 3,935 చదరపు మీటర్ల ప్రదేశం ప్రభావితం అవుతుంది. అలానే పశ్చిమ వైపున 4,387 చదరపు మీటర్ల ప్రదేశం ప్రభావితం అవుతుందని అంచనా వేశారు. తూర్పు వైపున 76 భవనాలు, పశ్చిమ దిక్కున 63 భవనాలు కలిపి మొత్తం 139 ప్రభావితం అవుతాయి. ప్రతిపాదిత బ్రిడ్జి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా జంక్షన్ నుంచి ఏసీ కళాశాల వైపునకు వెళ్లే మార్గంలో అమరావతి బస్టాప్ నుంచి ప్రారంభమౌతుంది. అరండల్‌పేట వైపున 10, 11 లైన్ల మధ్య దిగుతుంది. అయితే సర్వీసు రోడ్ల కోసం లాడ్జి సెంటర్ నుంచి భూసేకరణ చేయాల్సి ఉన్నది.



బాలల హక్కులను పరిరక్షించాలి

వసతి గృహాల్లో భద్రత కల్పించాలి ● జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ భారతి సయాని

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు సక్రమంగా పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయభారతి సయాని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మిని శంకరన్ హాలులో శనివారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఏబీ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా సంస్థల్లో, వసతి గృహాల్లో బాలలకు మెరుగైన సౌకర్యాలు, విద్య, భోజనం, భద్రత పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించి వైద్యారోగ్య శాఖ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. యాచక వృత్తిలో ఉన్న వారికి షెల్టర్ హోంలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మహిళల అదృశ్యం బాధాకరమని తెలిపారు. జిల్లాలో నమోదైన కేసులపై పూర్తి స్థాయిలో వివరాలు అందించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో అర్జీ అందించవచ్చన్నారు. మానవ హక్కుల సంఘాలు, సంస్థల పేరుతో ఎవరైనా బ్లాక్ మెయిల్‌కు పాల్పడితే కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. వారు తీసుకున్న చర్యలను పరిశీలించి పూర్తి స్థాయిలో కమిషన్ నివేదికను అందిస్తుందన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, జడ్పీ సీఈవో జ్యోతి బసు, సీపీవో శేషశ్రీ, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, డీఈవో శైలజ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ప్రేమకుమారి, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, మత్స్యశాఖ ఏడీ గాలి దేముడు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్‌బాబు, ప్రాంతీయ రవాణ అధికారి శ్రీహరి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ ఉదయ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల ఏడీ సువార్త తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయభారతి సయాని



గాంధీపార్క్..

ముంచెత్తిన వాన



కార్పొరేషన్ కార్యాలయం

శనివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. చీకట్లు కమ్ముకొచ్చాయి. పిడుగులతో కూడిన భారీ వర్షంతో నగరం మునిగింది. సుమారు గంటకుపైగా కురిసిన వర్షంతో నగర వీధులు చెరువులను తలపించాయి. చాలాప్రాంతాల్లో ట్రాఫిక్ కూడా స్తంభించిపోయి వాహనదారులు తీవ్రంగా ఇక్కట్లకు గురయ్యారు.

- గుంటూరు

కొమ్ముమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

తెనాలి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొమ్ముమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతైన ఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు కేవీసీ కాలనీకి చెందిన గుంజి రవీంద్ర (20) ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మండలంలోని సంగంజాగర్లమూడి శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం తన ఐదుగురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ఆలయం సమీపంలో ప్రవహిస్తున్న కొమ్ముమూరు కాలువలోకి దిగి ప్రమాదవశాస్తూ అందులోపడిపోయాడు. అతడి ఆచూకీ కోసం స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి వచ్చి ఫైర్ అధికారులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లి కాలువ వద్దకు వచ్చి కుమారుడి కోసం రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

- 'పల్లె పండుగ'తో అభివృద్ధి
- అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోటలో మంత్రి నాదెండ్ల శంకుస్థాపన


సిరిపురంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 13 వేల 362 పంచాయతీల్లో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టడం చాలా గొప్ప విషయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల పరిధిలోని అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోట గ్రామాల్లో శనివారం రూ.కోటి 30లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల్లో అభివృద్ధి బాటలు వేసిందని, దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కొల్లిపర మండలంలోని గ్రామాల్లో రూ 2. కోట్ల 50లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా రోడ్లు, డ్రైయిన్‌లు, రక్షిత మంచి నీటిసౌకర్యం కల్పించే విధంగా మంచి ప్రణాళికతో ముందుకు వెళతున్నామన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇక్కడే ఉపాధి కల్పించే విధంగా తగిన చర్యలు చేపడతామన్నారు. యువతకు ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చేలా పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. మన సంస్కృతిని, పల్లెటూరుల వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొల్లిపర మండలంలోని రైతులు వాణిజ్య పంటలు ఎక్కువగా పండిస్తారని, రాబోయే రోజుల్లో అగ్రికల్చర్ హబ్‌గా ఏర్పాటుకు తగిన కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పీఆర్‌ఏఈ ఎ.సాంబిరెడ్డి, కూటమి నాయకులు ఎ.నారాయణరెడ్డి, ఎం.వెంకయ్య, పి.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, డి.నరసయ్య, వై.వెంకయ్యనాయుడు, డి.ఏడుకొండలు, వై.పూర్ణచంద్రరావు, ఏటీఎం శ్రీను, వై.వెంకటరమణ పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గ్రామాల సమగ్రాభివృద్ధికి 'పల్లె పండుగ'

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పల్లె పండుగ నిర్వ హిస్తోందని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. అడ్డ రోడ్డు, నకరికల్లు గ్రామాల్లోని సీసీ రోడ్లకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఒక దివ్యాంగుడు, ఇద్దరు మహిళలు తమ పింఛన్ల కోసం ఎంపీని అభ్యర్థించగా వాటిని మంజూరు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీ కాశయ్యను ఆదేశిం చారు. నకరికల్లులో ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు తెలిపారు. రైతుల కోసం తీసుకు వచ్చిన ఇండో ఇజ్రాయల్ ప్రాజెక్టును సెంట్రాఫ్ ఎక్సలెన్స్ పనులను ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకుంటా మన్నారు. నడికూడి, శ్రీ కాళహస్తి రైల్వే లైన్ మార్గంలో ప్యాసింజర్ రైళ్ళు నడిపేలా చూడాలని కోరడంతో స బంధిత అధికారులతో మాట్లాడతానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు సురేష్‌లు, తస్లిమా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.శౌరయ్య, ఎంపీపీ ఎం.అను రాధ, జెడ్పీటీసీ హరీష్, ఎంపీడీవో జీ కాశయ్య, తహసీల్దార్ కే పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి లోకేశ్ చొరవ చూపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంటు కంపెనీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1993లో ఏసీసీ యాజమాన్యం, సిమెంటు ఫ్యాక్టరీని అక్రమలాకౌట్ చేసిందని చెప్పారు. గత 40 ఏళ్లుగా నష్టపరిహారం చెల్లించాలంటూ కార్మికులు ఆందోళన చేస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం గానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కూడా కార్మికులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంటు ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఇన్నేళ్లుగా ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యల పరిష్కారం కాలేదన్నారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసి కార్మికుల సమస్యను వివరిస్తామని పరిష్కరించే విధంగా ఒత్తిడి తీసుకొస్తామని, కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని రామకృష్ణ హామీ ఇచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా నేతలు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, సీపీఎం నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీ లా సెట్ స్పెషల్ కేటగిరీల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ శాస్త్ర కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లా సెట్-2024 సంబంధించి ప్రవేశాలలో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఆన్‌లైన్ ఆన్లైన్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎన్ సీసీ అభ్యర్థులు 126 మంది, సీఏపీ అభ్యర్థులు 12 మంది, పీహెచ్ అభ్యర్థులు 37 మంది, స్పోర్ట్స్ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారని తెలి పారు. సర్టిఫికెట్ల పరిశీలనను ఏపీ లా సెట్ 2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


హనుమంతరావు

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన గడ్డం హనుమంతరావు(70) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి మృతి చెందాడు. రుద్రవరం, ఆర్‌కేజీ పాలెం గ్రామాల మధ్య పశువులను మేపుతున్నాడు. ఈ క్రమంలో భారీ వర్షం కురవడం, పిడుగు పడటంతో హనుమంతరావు తలకు, శరీరం పై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గమనించిన సమీపంలోని వారు హనుమంతరావు బంధువులకు సమాచారం తెలియజేశారు. మృతదేహాన్ని రుద్రవరానికి తరలించారు. మృతుడి భార్య సీతా రావమ్మ గతంలో మృతి చెందారు. ఒక కుమా రుడు, కుమార్తె ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను నిర్వహించనుంది. దీని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు , రాష్ట్ర మంత్రులు మంగళగిరి సీకే కన్వె న్షన్‌కు రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ సూచించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండి కె.దినేష్‌కుమార్,జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాద్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

రోగులకు వైద్యం చేయండి.. రాజకీయాలు కాదు

- డీసీహెచ్‌ఎస్ ఎంఏ మజీదా బేగం
- ఈపూరు వైద్యాధికారి ఆత్మహత్యాయత్నంపై విచారణ


వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్ఎస్ఓ మజీదా బేగం

ఈపూరు,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రోగులకు మానవత్వంతో వైద్యం చేయాలి కాని ఆసుపత్రిలో రాజకీయాలు చేయకూడదని గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ ఎంఏ మజీదా బేగం అన్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కమలాకరరావు ఆత్మహత్యా యత్నం చేయడం, అందుకు ఆసుపత్రి సిబ్బందే కారణమని ఆయన చెప్పడంతో శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులను,సిబ్బందిని డీసీ హెచ్‌ఎస్ విచారించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ముప్పై పడకల ఆసుపత్రి సిబ్బంది 38 మంది ఉం డగా, అందులో 8 మంది వైద్యులు ఉన్నారని, రోగులకు వైద్య సేవలు అందించాల్సిందిపోయి వాళ్లందరూ రాజకీయాలు చేస్తుండడం బాధాకరమని అన్నారు. ఆసు పత్రి ఇంచార్జికి రికార్డు వర్క్ చాలా ఉంటుందని, ఇన్‌చార్జిపై ఒత్తిడి పెంచడం మంచి పద్ధతి కాదని అన్నారు. టెక్నాలజీ పెరిగినప్పటికి దానికి అనుగుణంగా వారు పని చేయడంలేదని తెలుస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వా లని, ఆ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆసుపత్రికి కొత్త ఇన్‌చార్జిని నియమిస్తామని చెప్పారు. ముందుగా ఆసుపత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. 28 మంది విధులలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆసుపత్రిలోని బెడ్స్, కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్,ఎక్స్‌రే ప్లాంట్, రక్తపరీక్షల గదిని, ఆక్సిజన్ సిలిండర్లను పరిశీలించారు. అయితే, బెడ్స్ అన్నీ ఖాళీగా ఉండడం చూసి ఆమె ఆశ్చర్యపోయారు. ఆసుపత్రిలో ఇంతమంది వైద్యులు,సిబ్బంది ఉన్నారు. రోగులు లేకపోవడం చాలా బాధగా ఉందన్నారు. నెలకు ఎన్ని కాన్పులు అవుతున్నాయని స్టాఫ్ నర్సును అడగగా ఒక్కటేనని సమాధానమిచ్చారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నాలుగు మాత్రమే చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రోగులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డీసీహెచ్‌ఎస్ఓ అందరికి మెమోలు ఇచ్చేందుకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థిని సాదియాకు 4 బంగారు పతకాలు


సాదియాను అభినందిస్తున్న వీసీ సారధివర్మ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుండి 13వరకు సన్ సిటి సౌత్ ఆఫ్రికా దేశంలో జరిగిన కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ జూని యర్ పోటీలలో కెఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పత కాలు కైవసం చేసుకుని రికార్డు సృష్టిం చిందని వీసీ జి.సారధివర్మ తెలిపారు. స్కాట్ 185 కిలోల బరువు పోటీలలో బంగారు పతకం, బెంచ్ ప్రెస్ 95 కేజీల బరువులో బంగారు పతకం, డెడ్ లిఫ్ట్ 180 కేజీల బరువులో బంగారు పతకం, ఓవరాల్ 460 కిలోల విభాగంలో మరో బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువు తున్నసాదియాను వర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, సాదియా తండ్రి షేక్ సంధాని పాల్గొన్నారు.



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ఖాసిం తదితరులు

అండర్-14,17 చెస్ రాష్ట్ర జట్లు ఎంపిక

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి గుంటూరు జిల్లాఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. అండర్-14 అండర్-17 బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు శుక్రవారం ముగిశాయని, అనంతరం రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ ఖాసిం స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.రవి వెల్లడించారు.

అండర్-17 బాలుర విభాగంలో ..

అర్జున్ ఆదిత్య రవి, (గుంటూరు), పీఎస్‌వీ యశ్వంత్ రాజ్ కుమార్ (గుంటూరు),ఏ చంద్ర మహేష్(మాచర్ల), ఐ.మోహిత్ వెంకట శ్రీ సాయి (మాచర్ల) ఆర్ భార్గవ్ శ్రీనివాస నాయక్ (మాచర్ల)

అండర్-17 బాలికల విభాగంలో..

ఎ.సాయి దివ్య (గుంటూరు), ఎం.నాగసరియా (అమరావతి),పి.దివ్య (కొలకలూరు), షేక్ నజీరా (ఆత్మకూరు), ఎం.మైథిలి (అమరావతి) తదితరులు ఎంపికయ్యారు.

అండర్- 14 బాలుర విభాగంలో..

కె.శాన్వి మౌజీ (మాచర్ల), ఎహెచ్ సూర్యనారాయణ(గుంటూరు), బి.ప్రజిత్ (గుంటూరు), ఆర్.లోకేష్ (పిడుగురాళ్ల) వై.యాజ్ఞస్ (గుంటూరు) ఎంపికయ్యారు.

అండర్-14 బాలికల విభాగంలో..

ఎం.తేజ అనూష (గుంటూరు), సిహెచ్ మేరీ అక్షయ (తెనాలి), బి.భావన (మిరియాల), సిహెచ్ లక్ష్మీచేతన (గుంటూరు) ఎం.మనస్వి, (గుంటూరు).

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	135, 145,155
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, సాంబశివరావుపేట, నాజ్‌సెంటర్, లాలాపేట, రైలుపేట, అహ్మద్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 'ర్యాంపు' కార్యక్రమం

గుంటూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 21 నుంచి ర్యాంపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా పరిశ్రమల అధికారి ఏ.జయలక్ష్మి తెలిపారు. జిల్లాలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల పని తీరును మెరుగుపరిచేందుకు ఈ సర్వే కార్యక్రమం జరుగుతుందని ఆమె వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో వారి పరిధిలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలు సేకరిస్తారని అన్నారు. సర్వే ద్వారా ఆయా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు.

ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న వైసీపీ : శ్రీనునాయక్

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం ఒక్క వైసీపీకే చెల్లిందని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడవత్ విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉండగా టీడీపీ కొనసాగించిన ఎస్సీ, ఎస్టీ పథకాలను రద్దు చేసి ఆయా సామాజిక వర్గాలను వెనకబాటుతనానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడులకు వైసీపీ సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ సెల్ కార్యదర్శి బత్తుల భాస్కర్ పాల్గొన్నారు.

జీఎంసీ బందెల దొడ్డికి పశువుల తరలింపు : కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి తీవ్ర ఆటంకంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను వెంగళాయపాలెంలోని జీఎంజీ బందెల దొడ్డికి తరలిస్తున్నామని, ఆయా పశువుల యజమానులు రోడ్ల మీదకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరంలోని మార్కెట్, నల్లచెరువు, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాల్లో రోడ్ల మీద ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్న ఆవులను జీఎంసీ బందె లదొడ్డికి నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు తరలించారు.

21న ఉక్కు దీక్ష-బహిరంగ సభ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు జయంతి సందర్భంగా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న ఉదయం స్థానిక అమరావతి రోడ్డులోని అమృతరావు సెంటర్ (సర్కిల్) వద్ద 'ఉక్కు దీక్ష- బహిరంగసభ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ టి.అమృతరాజ్ తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడారు.

22న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

గుంటూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి పంటకు తీవ్ర హానికరంగా మారిన ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమం ఈనెల 22న నిర్వహించనున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. గుంటూరులో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 65022 హెక్టార్లలో ఈ ఏడాది వరి పంట సాగు చేశారని తెలిపారు. ఈ పంటలో ఎలుకలు పిలకలను కొట్టేయడం వల్ల 20 నుంచి 25 శాతం దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. ఎలుకలను సామూహికంగా నిర్మూలించటం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయని అన్నారు. కృష్ణా డెల్టా పరివాహక 14 మండలాల్లో వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొని, సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెస్ విజేతలకు అభినందనలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, నెక్స్‌జెన్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగపు పోటీల్లో రూక్ రైడర్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-9 విభాగంలో ఎమ్ చేతన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, అండర్-7లో పిగగన్ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీ శర్మ, అకాడమీ చైర్మన్ రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు కరీముల్లా గుండెపోటుతో మృతి

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. స్థానిక సంగడిగుంటకు చెందిన కరీముల్లా మృతిపై పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరీముల్లా భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్, పార్టీ నేతలు షేక్ షౌకత్, షేక్ మీరావలి, పాటిబండ్ల బలరామ్, పలువురు పార్టీ కార్పొరేటర్లు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

గంగ అక్రమ అరెస్టు తగదు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడులో పోలీసులు శుక్రవారం రాత్రి 8 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకున్న 'మూలవాసి బచావో మంచ్' కార్యకర్త గంగను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది.



కలెక్టరేట్ ఎదుట గల మీసేవ వద్ద నిలిచిన నీరు



గాంధీ పార్క్ ఎదుట వర్షం వలన భారీగా స్తంభించిన ట్రాఫిక్

భారీ వర్షం.. రహదారులు జలమయం

- పలు కాలనీలలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- జీఎంసీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన నీరు
- నగరంలో పలుచోట్ల స్తంభించిన ట్రాఫిక్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి.. కొద్ది రోజులుగా ప్రతిరోజు కురుస్తున్న వర్షాలకు నగరం తడిసి ముద్ద అవుతుండగా.. శనివారం కురిసిన భారీ వర్షానికి నగరం జలమయంగా మారింది. ప్రధాన రహదారులు సైతం వర్షపు నీటితో నిండిపోయాయి... నగరంలోని ప్రధాన రహదారుల సైతం మోకాళ్ళ లోతు నీళ్ల చేరుకున్నా యి. దీంతో రహదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొ న్నారు. నగరంలోని జీఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ వర్షపు నీరు చుట్టుముట్టింది.



దీంతో ప్రధాన కారిడార్, పార్కింగ్ ప్రాంతంలోని వాహనాలన్నీ నీట మునిగాయి. నగరంలోని లక్ష్మీనగర్, నల్లచెరువు, ఏటి అగ్రహారం, ఆర్ అగ్రహారం, పాత గుంటూరులోని ఆలీ నగర్, లక్ష్మీ నగర్, ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక, పెదకాకాని రోడ్డులోని వాసవీనగర్, ఎన్టీఆర్ కాలనీ, మద్దిరాల రాజేశ్వరరావు నగర్, రెడ్డిపాలెం శివారు ప్రాంతాలైన హిమని నగర్, సరస్వతీ నగర్, లక్ష్మీ నగర్, రాయపాటి శ్రీనివాసనగర్, నగరంలోని ఎస్వీఎన్ కాలనీ చివరి కాలనీలు, నల్లపాడు రోడ్డు, నరసరావుపేట రోడ్డు, చిలకలూరిపేట రోడ్ లోని శివారు కాలనీలో వర్షపు భారీగా చేరుకుంది. దీంతో కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

← కంకరగుంట ఆర్‌యూబీలో నిలిచిన నీరు

సమస్యల పరిష్కారంపై కార్యదర్శులకు అవగాహన ఉండాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో సమస్యలు, పరి ష్కార మార్గాలపై సమగ్ర అవగాహన కల్గి ఉండాలని కమిషనర్ పులి శ్రీనివాసు లు ఆదేశించారు. శనివారం కమిషనర్ ఎన్‌జీవో కాలనీ, నల్లకుంట, శ్యామలా నగర్, పలకలూరు రోడ్, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీ లించి తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, డీఈఈలు మధుసూదన్, నాగభూషణం, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎంహెచ్‌వో ఆనందకుమార్, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈలు నాగవేణి, చైతన్య, శానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్కువ డిపాజిట్‌తో ఆటోనగర్‌కు మంచినీరు అందించాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆటోనగర్ ఏర్పడినప్పటి నుంచి 2416 ప్లాట్లు ఉండగా కేవలం 55 వాటర్ కనెక్షన్లు మాత్రమే ఉన్నా యని, ఇంతగా వెనుకబడిన ఆటోనగర్ అభివృద్ధి చేయడానికి ముందు డిపాజిట్‌తో వాటర్ కనెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఉందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శని వారం గుంటూరు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 283 ఎకరాల్లో నాలుగు ఫేసుల్లో ఉన్న ఆటోనగర్లో డిపాజిట్ ఎక్కువగా ఉన్న కారణంగా వాటర్ కనెక్షన్ తీసుకోవడానికి ఎక్కువ మంది ముందుకు రాలేకపోతున్నారని, చిన్న షాపులకు రూ.5000, ఇండస్ట్రియల్ అవసరాలు ఉన్నవారికి రూ.18500 డిపాజిట్‌గా పెట్టినట్లయితే ఎక్కువమంది వాటర్ కనెక్షన్ తీసుకుంటారని అన్నారు. సమీక్షలో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏపీఐఐసీ, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మహిళల సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్, సీవోలు, సీఎంఎంల సమీక్షలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరైనా బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించ టంలో కాని ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడంలో కానీ అవినీతి చేసినా, కమిషన్లు అడిగినా అదే ఉద్యోగానికి ఆఖరి రోజు అని, నిజాయితీగా పనిచేయాలని ఉద్యోగులను, రిసోర్స్‌పర్సన్స్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ టీవీ విజయ్‌లక్ష్మి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ మహిపాల్ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా వ్యూహాలను రచించాలి



మాట్లాడుతున్న మహారాణా

గుంటూరు(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో మార్పులకు అనుగు ణంగా వ్యూహాలను రచించి అభివృద్ధి చేస్తేనే నిలదొక్కుకుంటామని పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ ఎం మహారాణా అన్నారు. చేబ్రోలు మండ లం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ లా విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'బిజినెస్ డెవలప్‌మెంట్, డిస్ట్రి బ్యూషన్, కెరీర్ పాత్ గ్రోత్' అంశాలపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ ఎం మహారాణా మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్వ్యూలలో విజయం సాధించాలంటే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వడానికి ముందుగా పరిశోధ నలు చేయడం, స్పష్టమైన, విశ్లేషణాత్మక సమాధానాలు ఇవ్వడం ముఖ్యమన్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అర్థం చేసుకోవడం, ప్రశ్నించే వ్యక్తుల అంచనాలను గుర్తించడం, కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉన్న వారికి అవకాశాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ టీమ్ చాంపియన్ షిప్ విజేతగా గుంటూరు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్థానిక బీఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ - 24 పోటీలు శుక్రవారం అర్ధరాత్రితో ముగిశాయి. పోటీల్లో జూనియర్ బాయ్స్ టీమ్ చాంపియన్ షిప్‌ను గుంటూరు జిల్లా కైవసం చేసుకుంది. తరువాత స్థానాల్లో వరుసగా తూర్పుగోదావరి, వైఎస్సార్ కడప జిల్లాలు నిలిచాయి. అనంతరం విజేతలకు చీఫ్ కోచ్ నరసింహారెడ్డి బహుమతులు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సుబ్బారావు మాట్లాడుతూ గెలిచిన క్రీడాకారులు గుజరాత్‌లో జరిగే జిమ్నాస్టిక్స్ జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, ప్రముఖ వైద్యులు రమేష్, డాక్టర్ రాయపాటి మమత, స్థానిక కార్పొరేటర్ మీరావలి పాల్గొన్నారు.

ఐజేపీఎస్ సంపాదకులుగా సూర్యదేవర విద్యాధర

గుంటూరు(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ఐజేపీఎస్) ప్రధాన సంపాదకుడిగా చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల(చిప్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర ఎంపికయ్యారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ)కు ఇటీవ ల జరిగిన ఎన్నికల సందర్భంగా వివిధ విభాగాల చైర్మన్లు, ఐజేపీఎస్, ఫార్మా టైం పత్రికల సంపాదకుల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ విద్యా ధరను ఐజేపీఎస్ సంపాదకులుగా ఎంపిక చేశారు. దేశంలో 1939 నుంచి ఇండి యన్ జర్నల్ ఆఫ్ ఫార్మసీగా ఉన్న దీనిని 1979లో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌గా మార్చుచేసినట్లు డాక్టర్ విద్యాధర తెలిపారు. ఈ సందర్భంగా ఐపీఏ చైర్మన్ డాక్టర్ టీవీ నారాయణ, చిప్స్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శు లు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ పీఎన్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

విద్యార్థుల నూతన సమాజాభివృద్ధికి దోహదపడాలి

పెదకాకాని, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యార్థుల పాత్ర చాలా ఘనమైనదని, వారు నూతన సమాజాభివృద్ధికి దోహదపడాలని నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలైన సందర్భంగా ఈనెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న అర్ధ శతాబ్దోత్సవ సభకు సంబంధించిన గోడపత్రికలను శనివారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎల్ రాజశేఖర్, కే భాస్కర్ మాట్లాడుతూ ఈ సభను జయప్రదం చేయడానికి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సునీల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కాకి నాని, రాజేష్, మానస, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుకు డీడీ అందజేస్తున్న అప్సా నాయకులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు అప్సా వితరణ

గుంటూరు(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో వరద బాధితులకు విరాళం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు రూ.60లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. ఈ మేరకు డీడీ సీఎం చంద్రబాబుకు అందజేశారు. సంఘం నాయకులు కొమరగిరి చంద్రశేఖర్, మేకల రవీంద్ర బాబు, హర్ష, మెట్ల జనార్ధన్‌రావు, భాస్కరరావు, అప్పలనాయుడు, సింహాచలం, రాజు, లెక్క రమేష్, బత్తిన వెంకటరావు, గౌరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్రచెరువును కాపాడుకోవటానికి సంఘటితం కావాలి : జూపూడి

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రజకులు తమ వృత్తి చేసుకొని జీవనం సాగించే పాతగుంటూరు ఎర్రచెరువుపై కొందరు నేతలు కన్నేసి తమ జాతికి అన్యాయం చేసేలా గత వైసీపీ ప్రభుత్వంలో అనేక కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గుంటూరు టౌన్ రజక జన సేవాసంఘం ఆధ్వర్యంలో పాతగుంటూరు శ్రీ గంగానమ్మ కమ్యూనిటీ హాల్లో శనివారం బహిరంగసభ జరిగింది. జూపూడి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొందరు స్వార్థపరులు రాజకీయ నాయకుల ముసుగులో ఎర్రచెరువు లో పాగా వేసి వృత్తిదారులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎర్రచెరువు జోలికొస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు మెట్టపల్లి మహేంద్ర, ఈమని ఉమామహేశ్వరరావు, మోతుకూరి ఆంజనేయులు, కటివరపు వీరాస్వామి, గుంటూరు గణేష్, పిడుగురాళ్ల సురేష్, రమాదేవి, లింగాల బిక్షం, గుంటూరు నరసింహరావు, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులున్నారు.

గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదు ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

గుంటూరు(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు నియోజకవర్గాల గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను నిబంధన కనుగుణంగా నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కే ఎస్ఎస్ ప్రసాద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ డీఆర్వో పెద్దిరోజాకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి, సుందరయ్య నగర్ లోని మహానాడు ప్రాంతంలో వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన బాధితుల కు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విజయవాడ బుడమేరు వరదల్లో నష్టపోయిన వారికి ఇచ్చిన మాదిరిగానే రూ.25వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు వై కృష్ణకాంత్, ఉష, భ్రమరాంబ, జ్యోతి, లక్ష్మీ భ్రమరాంబ, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలుపై తనిఖీ



తనిఖీలు చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

గుంటూరు(లీగల్), అక్టోబరు 19: గుంటూరు నగరంలో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉన్న పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి మూడు రోజులుగా తనిఖీ నిర్వహిస్తున్నారు. హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆమె ఈ నెల 17న నగరంపాలెంలోని స్టాల్స్ గర్ల్స్ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌ని సందర్శించారు. ఈ శనివారం ఏటీ అగ్రహారంలోని, ఎస్‌కేబీఎం ప్రైమరీ, హై స్కూల్‌ను, కొండా వెంకటప్పయ్య కాలనీలోని కొల్లి శారద రౌండ్ టేబుల్ మున్సి పల్ హైస్కూల్‌ను, కొల్లి శారద రౌండ్ టేబుల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌ను, చుట్టుగుంటలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి అక్కడ అమలు జరుగుతున్నా మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి ఆరా తీశారు. పిల్లలకు ఏమైనా సదుపాయ లోపాలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావొచ్చని వారికి వివరించారు.

కోర్టు వాయిదాకు ఒకరికి బదులు మరొకరు

● దొరికిపోయిన నకిలీ నిందితుడు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ఉద్యమం- 2020 నేపథ్యంలో తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కోర్టు వాయిదాకు ఒకరికి బదులు మరొకరు హాజరై దొరికిపోయాడు. ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శరత్‌బాబు ఆదేశాలతో కోర్టు ఏఓ శివ సుబ్రహ్మణ్యం, నిందితుడిని నగరంపాలెం పోలీసులకు అప్పగించగా, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి సూచనలతో నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. పోలీసుల కథనం మేరకు, రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ నాడు బాపట్ల ఎంపీగా ఉన్న నందిగం సురేష్ స్వగ్రామం ఉద్దండరాయునిపాలెంలో రాజధాని రైతులు ర్యాలీ నిర్వహించారు. మూడు రాజధానులకు మద్దతిస్తున్న సురేష్ వర్గీయులు తమపై దాడికి వస్తున్నారంటూ వీరిపైకి రాళ్లతో దాడికి యత్నించగా జరిగిన గొడవపై సురేష్ బంధువు పులి మాణిక్యరావు ఫిర్యాదు మేరకు తుళ్ళూరు పోలీసులు 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కోర్టులో శనివారం వాయిదా ఉంది. ఈ కేసులో 20వ నిందితుడు వెంకటేశ్వరరావు విదేశాలకు వెళ్ళడంతో ఆయన స్థానంలో అతని అన్న కుమారుడు సునీల్‌ను వెళ్ళమని చెప్పడంతో అతను వాయిదాకు హాజరయ్యాడు. ఒకరికి బదులు మరొకరు వాయిదాకు వచ్చినట్లు న్యాయమూర్తికి ఫిర్యాదు రావడంతో ఈ మేరకు ఆయన విచారణ చేశారు. నకిలీ నిందితుడు విచారణకు వచ్చినట్లు తేలింది.



పార్టీ శ్రేణులతో సమావేశమైన ఎమ్మెల్యే గల్లా మాధవి

కార్యకర్తలకు అండగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీనేనని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆమె 18, 19, 20 డివిజన్ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ఆమె ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే పార్టీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులకు సభ్యత్వ నమోదు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. గతంలో కంటే ఈసారి ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేసి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె కోరారు. గతంలో రూ.2 లక్షలు ఉండే కార్యకర్తల బీమాను రూ.5 లక్షలకు అధినేత చంద్రబాబు పెంచారన్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా జీవిత కాల సభ్యత్వాన్ని ప్రవేశ పెట్టారని, చనిపోయిన కార్యకర్తల అంత్యక్రియలకు రూ.10 వేలు చొప్పున తక్షణ సాయం అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఉప్పతల సాంబ, రాళ్ల బండి రామరాజు, తన్నీరు కృష్ణ, రబ్బాని, ముత్తినేని రాజేష్ తదితరులు పాల్గొ న్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పశ్చిమ నియోజకవర్గం 35వ డివిజన్ పట్టాభిపురం మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు వద్ద కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకేంద్రాన్ని ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను అధికంగా చేరే విధంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని, అందరికి సుపరిచితులైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా జాతీయ మానవ హక్కుల కమిషన్

- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా స్పందిస్తాం
- ఇన్‌చార్జి చైర్‌పర్సన్ విజయభారతి సయాని

గుంటూరు(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, ఆ హక్కులకు భంగం కలిగినపుడు సంబంధిత శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పంపించవచ్చని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ విజయభారతి సయాని తెలిపారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మానవ హక్కులపై అవగాహన, భారతీయ సంస్కృతి, కళలు- అధ్యయనం తదితర అంశాలపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. భారతి సయాని మాట్లాడుతూ వ్యక్తి హక్కులకు భంగం కలిగినపుడు ప్రసార మాధ్యమాల ద్వారా విషయం తెలిసినపుడు మానవ హక్కు ల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బాలల హక్కులు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలసి ఉందని, బాలలకు, మహిళలకు, వృద్ధులకు, మత్స్యకారులకు, మైనారిటీలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ట్రాన్స్ జెండర్స్‌కు ఇలా సుమారు 60 వర్గాల వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కేవీజీఎస్ మూర్తి పాల్గొన్నారు.



వృత్తిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న విజయభారతి సయాని తదితరులు

మహిళా సాధికారతలో నైపుణ్యాలే కీలకం

మహిళల సాధికారత కోసం నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జాతీయ మానవహక్కుల ఇన్‌చార్జి చైర్‌పర్సన్ విజయభారతి సయాని అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో మానవ హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలోఉన్న మహిళలు ఎన్నోనైపుణ్యాలు కలిగి ఉంటారని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. జాతీయ మానవ హక్కుల సంఘం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ కార్యదర్శి రామచంద్రరాజు, ఇంటాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


బాణాసంచా ప్రమాదాలు లేకుండా చర్యలు చేపట్టాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : దీపావళిని ప్రమాదాలు లేకుండా సురక్షితంగా, ప్రశాంతంగా ప్రజలు జరుపుకునేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ ఏ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జేసీ ఏ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్ శ్రీనివాసరావులతో కలిసి దీపావళి బాణసంచా షాపుల అనుమతులు విక్రయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, కమర్షియల్ టాక్స్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, దీపావళి బాణాసంచా హోల్‌సేల్ దుకాణాదారులతో శనివారం సమావేశం నిర్వ హించారు. జేసీ భార్గవ్ తేజ మాట్లాడుతూ తాత్కాలిక బాణాసంచా దుకాణాల కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే పండుగకు నాలుగు రోజుల ముందే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. అనుమతుల జారీకి గాను సింగల్ విండో పద్ధతిలో లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించి అనుమతులు జారీ చేయడంతో పాటు నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లింపులకు సంబంధిత అధికారి కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ట్రాఫిక్ రమేష్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ డి.చిన్నయ్య, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, డీపీవో కార్యాలయం ఏవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మగువ మేలుకో.. తెలుసుకో



మహిళలు.. సముద్రాన్ని సోదిస్తున్నారు.. అంతరిక్షాన్ని అందుకుంటున్నారు.. దేశ రక్షణ దిశలో అడుగులేస్తున్నారు.. కానీ వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే భయం. పగలు.. రాత్రి.. అన్న తేడా లేకుండా ఏదో ఒక దారుణం. నేరాలు.. ఘోరాల్లో మహిళలు సమిధులుగా మారుతున్నారు. వయసు తారతమ్యాలు లేకుండానే మృగాలు వెంటాడుతున్నాయి.. వేధిస్తున్నాయి.. వధిస్తున్నాయి. రాజ్యాంగం ఎన్ని రక్షణ చట్టాలు కల్పించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. నేతలు, అధికారులు వేదికలపై మహిళా రక్షణ గురించి చేస్తున్న ప్రకటనలు గాలిలో కలుస్తున్నాయి. అసలు మహిళలు తమకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాల గురించే తెలుసుకోవడంలేదు. ఇదే అవకాశంగా మహిళలు నానాటికీ అణిచివేతకు గురవుతున్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాల గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం..

- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలపై పరంపరగా సాగుతున్న అత్యాచారాలు, హత్యలు, సామూహిక అఘాయిత్యాలు సమాజాన్ని కలవర పెడుతున్నాయి. సాంకేతికత, నాగరికత ఎంత విస్తరించినా మహిళలకు అన్యాయాలు.. వారిపై అత్యాచారాలు తగ్గడంలేదు. విద్యాలయం మొదలు పనిచేసే ప్రదేశం వరకూ అతివల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మహిళల రక్షణకు రాజ్యాంగం ఎన్నో చట్టాలు రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళల రక్షణ కోసం చట్టాలు తెస్తున్నాయి. వచ్చిన సమస్యల్లా తమకు అన్ని రక్షణలు ఉన్నాయని మహిళలు తెలుసుకోలేకపోవడమే. ఆ చట్టాలపై వారిలో అవగాహన లేకపోవడమే. తాజా పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంలో మహిళలు ప్రతి ఒక్కరూ.. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా తమకోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, తెచ్చిన చట్టాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా మహిళల రక్షణ వారి చేతుల్లోనే ఉంటుంది.



● స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం..

మహిళలను వేధించినా బలవన్మారణానికి పురికొల్పినా, హత్య చేసినా, అత్యాచారం చేసినా, అవమానపర్చినా, వారి హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించినా భారత శిక్షా స్మృతి కింద నేరంగా పరిగణిస్తారు. మహిళలను అవమానిస్తూ మాటల రూపంలో, సంజ్ఞల రూపంలో, ఏదైనా ప్రదర్శన ద్వారా అసభ్యకర ప్రవర్తనతో కించపరిస్తే ఆ నేరానికి ఏడాది సాధారణ జైలు, జరిమానా విధిస్తారు. నేర పూర్వక బలవంతం, సంజ్ఞల ద్వారా మహిళలను వేధిస్తే సెక్షను 354 (ఎ)ప్రకారం ఐదేళ్లకు తగ్గకుండా ఏడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా.

● సభ్యత - నైతిక నియమాల ఉల్లంఘనకు..

బహిరంగ ప్రదేశంలో అసభ్యకర పాటలు పాడటం, మరేదైనా అసభ్యకర చర్యలు చేయడం సెక్షన్ 294 ప్రకారం నేరం. ఇందుకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా. బాల, బాలికలకు అసభ్యకర సాహిత్యం, వస్తు సామగ్రి వంటివి విక్రయించడం తీవ్ర నేరంగా సెక్షన్ 293 ప్రకటించింది. ఈ నేరం కింద మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా తప్పదు.

● అత్యాచారం, ఆ తరహా నేరాలకు..

హింసా ప్రవృత్తితో స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక అపచారం అత్యాచార నేరంగా పరిగణిస్తారు. సెక్షన్ 376 'ఏ' నుంచి 'డీ' వరకు క్లాజులలో సందర్భం, తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు. సెక్షను 376(1) ప్రకారం ఏడేళ్లకు తగ్గకుండా పదేళ్ల వరకూ, ప్రత్యేక సందర్భాల్లో జీవితకాలం వరకు జైలుశిక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. నిర్భయ చట్టం కింద కేసు నమోదై విచారణలో దోషులుగా తేలితే ఉరిశిక్ష విధించే అవకాశం ఉంది.

● మోసపూరితంగా నమ్మించి ఇష్టంలేని వివాహానికి ప్రయత్నిస్తే ఆ వ్యక్తికి సెక్షను 366 ప్రకారం పదేళ్ల జైలు, జరిమానా విధిస్తారు.

ఐసీడీఎస్ కృషి నామమాత్రమే

మహిళలను చైతన్య పరచడంలో ప్రభుత్వం ఇంకా వెనకంజలోనే ఉంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గడిచిన 8 నెలల్లో 360 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పురుషుల అపసవ్య ప్రవర్తనపై చిన్నారులు, మహిళలకు అవగాహన కల్పించారు. అయితే ఇవి నామమాత్రమనే చెప్పాలి. రోజువారీ కార్యక్రమంగా అవగాహన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

అరచేతిలోనే రక్షణ

మహిళలను సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రక్షణచర్యలు చేపడుతున్నాయి. సెల్‌ఫోన్ వచ్చిన తరువాత మహిళా రక్షణ అవకాశాలు మరింత పెరిగాయి. మహిళ తనకు ప్రమాదం ఎదురైనప్పుడు ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నెంబర్లకు 100, 112, 1091, 181 ఫోన్లు చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్‌కు ఉండే పవర్‌బటన్‌ను మూడుసార్లు ఆపకుండా నొక్కితే ఎమర్జెన్సీ కాల్ 112కి కాల్ వెళుతుంది. కాకపోతే దీనిపై మహిళలకు అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు ఇంకా జరుగుతున్నాయి. దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా వుంది.

రాజ్యాంగం కల్పించిన హక్కులు

రాజ్యాంగం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించింది. లింగ వివక్షతను నిషేధించింది. స్త్రీల గౌరవాన్ని కించపరిచే పని ఏదీ చేయకూడదనేది ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా ప్రకటించింది. మహిళలు, చిన్నారుల అక్రమ రవాణాను నివారించేందుకు 1958లో అక్రమరవాణా నిరోధక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. రాష్ట్రప్రభుత్వం 1988లో దేవదాసీ వ్యవస్థ నిషేధచట్టాన్ని తెచ్చింది. స్త్రీ అసభ్య చిత్రీకరణ నిషేధ చట్టాన్ని 1986లో తెచ్చింది. 1984లో కుటుంబ న్యాయస్థానాల చట్టం, 2001లో జాతీయ ఉచిత న్యాయ సహాయ సేవాసంస్థ, 2004లో మహిళా న్యాయస్థానాలు ఏర్పాటుచేశారు. 2013లో నిర్భయ చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం అత్యాచారానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా ఉరి శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. నిర్భయ నింధితులను ఈ చట్టం కింద నింధితులను ఉరి తీశారు.

అవగాహనే శ్రీరామ రక్ష

మహిళల కోసం ప్రభుత్వం అనేక రక్షణలు కల్పించింది. ఐసీడీఎస్ ద్వారా నిరంతరాయంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా మహిళల్లో చట్టాలు, రక్షణలపై అవగాహనా లేమి కనిపిస్తోంది. అవగాహన పెంచుకుంటేనే మహిళలకు స్వీయ రక్షణ సాధ్యమవుతుంది. ప్రధానంగా చిన్నారులు మోసకారుల బారిన పడకుండా రక్షించుకోగలుగుతాం.

- పద్మావతి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు

అటకెక్కుతున్న అట్లతద్దె!

● గ్రామాల్లో కనుమరుగవుతున్న సాంప్రదాయ పండుగలు



పడమరబాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో అట్లతద్దె సందర్భంగా ఏర్పాటు చేసిన ఉయ్యాల

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అట్లతద్దె పండుగ వచ్చిందంటే చాలు ప్రతి గ్రామంలో ఉయ్యాలలు ఏర్పాటు చేసి ఆడపడుచులు నోములు నోచుకొని వాయినాలు పంచేవారు. తెల్లవారుజాము నుంచే ఉయ్యాల ఏర్పాటు చేసిన ప్రాంతంలో మైక్‌లు పెట్టి ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పెద్దఎత్తున సందడి చేసేవారు. నాటి వేడుకలు నేడు కనిపించటంలేదు. గ్రామాలు మొత్తం కలియతిరిగితే ఎక్కడో ఒకచోట మాత్రమే ఉయ్యాల కనిపిస్తున్నది. దానిపై ఊగేవారు కేవలం కొద్ది మంది మాత్రమే ఉంటున్నారు. ఒకప్పుడు ఉయ్యాల దగ్గర గ్రామస్తులంతా వరుసగా నిలబడి ఒకరితర్వాత ఒకరు ఊగే వారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. వేడుకలను కూడా మొక్కుబడిగా చేస్తున్నారు. భర్త ఆయురారోగ్యాలతో ఉండాలని, 11 మంది ముత్తయిదువులు చంద్రోదయ ఉమాగౌరి వ్రతం చేసి 11 మందికి వాయినాలు ఇస్తారు. అదేవిధంగా ఒక పోతురాజుకు కూడా వాయినం ఇచ్చేవారు. ఈసందడి ప్రతిగ్రామంలో కనిపించేది. ఇళ్ళు శుభ్రం చేసి ఇంటి ముందు ముగ్గులు వేసి వేడుకగా జరుపుకునే ఈ కార్యక్రమాలు కాలక్రమేణ అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రజలు సోషల్‌మీడియాకు అలవాటుపడిపోయి నాటి సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిచూపటంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదేవిధంగా జరిగితే భవిష్యత్తు తరాలకు సాంప్రదాయక పండుగలు, వేడుకలు ఉండేవనే విషయం కూడా తెలియక పోవచ్చు. కావున సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ప్రకాశం బ్యారేజి వద్ద

పెరిగిన వరద ఉధృతి

● దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశంబ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 84 వేల 297 క్యూసెక్కుల వరదనీరు శనివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40గేట్లను 2అడుగులు, 30 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువలకు 4,028 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 2,519 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. 12 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 97,200 క్యూసెక్కులను దిగువకు విడుదలచేశారు. సాగర్ నీటిమట్టం 590 అడుగులు వుంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 4,940 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,638, 12 క్రస్ట్ గేట్ల ద్వారా 97,200, ఎల్‌ఎల్‌సీ ద్వారా 400, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుండి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

స్టాండింగ్ కమిటీ సభ్యుల

నియామకం జరిగేనా ?

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవికాలం పూర్తయింది. ఇప్పటి వరకు మేయర్ మనోహర్‌నాయుడు అధ్యక్షుడిగా, మరో ఆరుగురు సభ్యులతో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఏర్పడింది. ప్రతి సంవత్సరం ఎన్నికల ద్వారా స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు. ప్రతి ఏటా జరిగే ఈఎన్నికల్లో ఛైర్మన్ మేయర్ కొనసాగుతూ, సభ్యులు మారుతూ ఉంటారు. ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీతో ప్రస్తుత స్టాండింగ్ కమిటీకి పదవికాలం పూర్తయింది. ఈకమిటీలో సభ్యులుగా కార్పొరేటర్ షేక్ మహమ్మద్, సంకూరు శ్రీనివాసరావు, కాండ్రగుంట గురువయ్య, శ్యామల వెంకటరమణాదేవి, మాలిబోయిన శ్రీవల్లి, పాప తోటి అంబేద్కర్‌లు ఈ పదవుల్లో కొనసాగారు. ఆగస్టు ఆరో తేది నుంచి వీరంతా మాజీలయ్యారు. అప్పటినుండి కొత్త కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. వాస్తవానికి నగరంలో రూ.50 లక్షల రూపాయల వర్క్ చేపట్టాలంటే స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికను నిర్వహించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైలు హోల్టింగ్‌కు మోక్షమెప్పుడు ?

వేమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయాలంటూ ఈ ప్రాంత ప్రజలు అనేక మార్లు మొరపెట్టుకున్నా ఫలితం కానరాకుంది. సికింద్రాబాద్-రేపల్లె వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు గతంలో వేమూరులో హాల్ట్ ఉండేది. కరోనా సమయంలో కొన్ని రైళ్లు రద్దు చేసిన తర్వాత తిరిగి వేమూరులో రైలు పునరుద్దరణలో చేసిన కొన్ని చోట్ల హాల్ట్‌లు ఎత్తివేశారు. ఆ నేపధ్యంలో డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయకుండా తెనాలి, చినరావూరు, భట్టిప్రోలులో నిలుపుదల చేస్తున్నారు. వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు రైల్వేశాఖ అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం కానరాకుంది. ఈ మధ్య కాలంలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తేన్నేటి కృష్ణప్రసాద్‌ను వేమూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలిసి వినతులు అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు అనేకమార్లు వినతులు అందించారు. నేటి వరకు డెల్టా రైలు వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయక పోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు కృష్ణప్రసాద్ డెల్టా రైలు వేమూరులో నిలుపుదల చేసే విదంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నాయి. ఇంత వరకు వేమూరులో డెల్టా రైలు నిలుపుదల కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. తక్షణం ప్రజా ప్రతినిధులు రైల్వే అధికారులు స్పందించి డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదలచేసేలా చర్యలు తీసుకోవాలని వేమూరు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వీరగల్లు శిల్పాన్ని పరిశీలిస్తున్న సతీష్‌బాబు

వెయ్యి సంవత్సరాల నాటి

విగ్రహం లభ్యం



మాచర్లటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):దుర్గి మండలం బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాంతంలోని పిచ్చిమొక్కల మధ్య సుమారు వెయ్యి ఏళ్లనాటి వీరగల్లు విగ్రహాన్ని చరిత్ర పరిశోధకుడు పావులూరి సతీష్ బాబు గుర్తించారు. కుడిచేతిలో కత్తి, ఎడమ చేతిలో డాలు, చెవులకు పెద్ద కుండలాలు, మెడలో గొలుసులు, చేతులకు రుద్రాక్ష మాల ధరించి శత్రువుతో పోరాడుతున్నట్లు శిల్పం ఉందన్నారు. ఆనాటి ప్రజలు మృతి చెందిన వీరుల శిల్పాలను చెక్కి చెరువులు, బావులు, గ్రామ పొలిమేరలు, ఆలయాలవద్ద ప్రతిష్ఠించేవారని సతీష్‌బాబు తెలిపారు. అలనాటి వీరుల శిల్పాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సతీష్‌బాబువెంట ఉప్పుతోళ్ల రమేష్, కిరణ్‌లు ఉన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ తమిళనాడు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను తమిళనాడు మహిళా జట్టుకు అందజేస్తున్న నిర్వాహకులు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యునివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తమిళనాడు రాష్ట్రం ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అలాగే బాలుర విభాగంలోనూ, బాలికల విభాగంలోనూ తమిళనాడు రాష్ట్రం అత్యధిక పాయింట్లు సాధించి రికార్డు సృష్టించారు. మూడు కేటగిరిలో తమిళనాడు మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. విజేతలకు పోటీల నిర్వాహక కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఏ హైమావతి, జాయింట్ సెక్రటరీ ఏ.వీ. రాఘవేంద్రరావు, తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. సారంగపాణి, మాజీ ఇంటర్నేషనల్ అథ్లెట్ శ్రీనివాస్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్ శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ ఎం. నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. మధుసూదన్‌రావు తదితరులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

గుంటూరు రేషన్ దొంగలు

నల్గొండలో దొరికారు

- 550 క్వింటాళ్ల పేదల బియ్యం స్వాధీనం
- పట్టుకున్న బియ్యం విలువ రూ. 18 లక్షలు ఉంటుందని అంచనా
- బాపట్లకు చెందిన సుధాకర్, కర్ణాటకకు చెందిన సలావుద్దీన్ అరెస్టు
- విషయం తెలుసుకొని మాఫియా నేత పరారీ

గుంటూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌మాఫియా ఆగడాలు అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో పట్టుదలతో ఉన్నప్పటికీ లారీల కొద్దీ రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతూనే ఉన్నది. రెండు రోజుల క్రితం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రేషన్‌మాఫియా సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్న బియ్యం రూపంలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల కన్నుగప్పి సరిహద్దు దాటించినప్పటికీ నల్గొండ పోలీసులు, పౌర సరఫరాలశాఖ అధికారుల వలలో చిక్కారు. రెండు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మాఫియాలో కీలకపాత్ర పోషిస్తున్న బాపట్ల పట్టణానికి చెందిన చీమకుర్తి సుధాకర్‌ను అరెస్టు చేశారు. అతనితో పాటు కర్ణాటకకు చెందిన లారీ డ్రైవర్ సలావుద్దీన్, మరో డ్రైవర్ భీమయ్యను అరెస్టు చేశారు. ఈ మాఫియాలో మరొక భాగస్వామి అయిన గుంటూరు పట్టణానికి చెందిన అశోక్ పరారయ్యాడు. వీరు ఈ విధంగా ప్రతి నెలా 10 నుంచి 12 లారీల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నట్లు నల్గొండ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలోనే గురువారం కేఏ 56, 2700 నెంబరు గల లారీలో తెలంగాణ వైపు తరలివెళుతున్న 245 క్వింటాళ్ళ బియ్యాన్ని పట్టుకున్నారు. అదే విధంగా జీజే 25 యూ 2727 నెంబరు గల మరో లారీలో తరలిస్తున్న 250 క్వింటాళ్ళ పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకోవటం జరిగింది. సుధాకర్ గత కొన్ని సంవత్సరాలుగా బాపట్లలోని తన రైస్ మిల్లు (శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్)లో రైతుల నుంచి సేకరించిన వడ్లతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన పీడీఎఫ్ రైస్‌ను రీ సైక్లింగ్ చేసి వాటిని సన్నబియ్యం వలె పాలిష్ చేసి 20 కేజీలు, 30 కేజీల ప్లాస్టిక్ సూపర్ బ్యాగ్స్‌లో పార్శిల్ చేసి వాటికి సంబంధించి నకిలీ బిల్లులు కూడా రూపొందించి ఈ దొంగ వ్యాపారం చేస్తున్నట్టు వెల్లడైంది. గుంటూరుకు చెందిన అశోక్ కూడా ఇందులో పాత్ర ధారి అని సుధాకర్ ద్వారా తెలుసుకున్న నల్గొండ పోలీసులు అతన్ని అరెస్టు చేసేందుకు గుంటూరుకు వచ్చినట్లు సమాచారం. అయితే అతను పరారీలో ఉన్నట్లు తెలుసుకొని వెనుతిరిగిపోయినట్లు తెలిసింది. వీటి విలువ రూ. 18 లక్షలకు పైగానేఉంటుందని నిర్ధారించారు. ఏపీ నుంచి ఇంత భారీ మొత్తంలో బియ్యం తరలిపోతుంటే పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

జిల్లా స్థాయిలో అధికారులకు మాఫియాతో బలమైన సంబంధాలు వున్న నేపథ్యంలో వారికి ఫిర్యాదు చేయడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడమే మేలనే పరిస్థితి ఏర్పడింది. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే ఆయా శాఖల రాష్ట్ర అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు తప్ప వీరికి మాత్రం ఫిర్యాదులు చేయడం లేదు. ఈ పరిస్థితులను చక్క దిద్దడం కోసం విజిలెన్స్ శాఖ ప్రక్షాళన చేపట్టింది. పలువురు అధికారులను బదిలీ చేసింది. కానీ పరిస్థితిలో మార్పు లేదు. విజిలెన్స్ ఎస్పీ అడపాదడపా దాడులు చేస్తున్నారు తప్ప నిఘా విభాగం ఏమాత్రం గాడిలో పడలేదు. ఇంత పెద్ద మొత్తంలో బియ్యం తరలిపోతున్నా సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విశేషం. తాజాగా ఒక కేసులో 80 బస్తాలు బియ్యం పట్టుకుని కేవలం 1100 కిలోల బియ్యమే దొరికినట్లు చూపారన్న విమర్శలు గుప్పుమంటుండడంతో మాఫియాతో అధికారుల సంబంధాలు ఉన్నాయన్న వాదనకు బలం చేకూరుతోంది.

రేషన్ బియ్యం ఎక్కడ దొరికినా మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే..

గుంటూరుజిల్లా రేషన్ మాఫియా అక్రమాలు 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టడం తో మాఫియా కొత్త భాగస్వాములతో వ్యవహారం నడుపుతోంది. గుంటూరు కాకాని రోడ్డులోని మిల్లు భాగోతం బయట పడడంతో జిల్లాలోని ఐదోమైలు సమీపంలోని ఒక మిల్లు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, పేరేచర్ల, ఫిరంగిపురంలలోని మిల్లులకు రేషన్‌బియ్యాన్ని తెచ్చి సన్న బియ్యంగా మార్చి తరలిస్తున్నారు.



రేషన్‌మాఫియా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న నల్గొండ పోలీసులు (ఫైల్)

కుమార్తె కన్పించటం లేదని తండ్రి ఫిర్యాదు

వట్టిచెరుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన కే రమేష్ తన కుమార్తె కన్పించటం లేదని వట్టి చెరుకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీ ఫార్మసీ చదువుతున్న తన కుమార్తె కే కల్పన(20) ఈనెల 12వ తేదీన పరీక్షలున్నాయని కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ విచారించినా కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 2519 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 2519 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 64,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 40క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 90 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1020 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తొమ్మిదో వార్డులో పాము కాటుకు గురై ఓ వృద్ధురాలు శనివారం మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం ఇంట్లో తీగపై బట్టలు తీస్తుండగా గోడలో నుంచి వచ్చి పాము కాటేసినట్లు బాధితురాలు తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్య పరీక్షలు చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి


పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

తాడికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందిన ఘటన నిడుముక్కల గ్రామంలో జరిగింది. శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగుపడటంతో మేతమేస్తున్న గొర్రెల్లో 5 గొర్రెలు మృతి చెందాయి.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

మేడికొండూరు అక్టోబరు 19: మేడికొండూరు గ్రామ సమీపంలోని ఎన్ఎస్‌పీ కాలువలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం పడివుండగా శనివారం పోలీసులు వెలికి తీశారు. మృతుని శరీరంపై పొడవు చేతులున్న తెల్ల రంగు చొక్కా ఉన్నాయి. అతడికి సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు చెబుతున్నారు. మృతి చెంది మూడు లేదా నాలుగు రోజులు అయివుండవచ్చునని, ఆచూకి తెలిసిన వారు మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఆహారపు అలవాట్లపై అవగాహన

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన అలవాట్లు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితంతోపాటు జీవన ప్రమాణాలు పెంపొందించుకోవచ్చని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని ఏఐ డేటా సైన్స్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లి మండలం చిర్రావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జో నితిన్, పి సురేష్, ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-17 వాలీబాల్ జిల్లా జట్టుకు మహేంద్ర


కట్టెపోగు మహేంద్ర

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సీకే జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న కట్టెపోగు మహేంద్ర అండర్-17 వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ అత్తోట రత్నబాబు తెలిపారు. వేజెండ్ల జడ్పీ హైస్కూల్లో జరిగిన ఎంపిక పోటీల్లో మహేంద్ర అద్భుత ప్రతిభ కనబర్చి ఈ ఘనత సాధించాడని అన్నారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈ నెల 21వ తేదీ నుంచి జరుగనున్న అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో మహేంద్ర పాల్గొంటాడు. జిల్లా జట్టుకు ఎంపికైన మహేంద్రను కళాశాల కరస్పాండెంట్ జంజనం పాండురంగారావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఏవీఎస్ వరలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధిలో పల్లెపండుగ కీలకం

వట్టిచెరుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో పల్లెపండుగ కీలకమైందని ఎంపీడీవో ఎం రమేష్‌బాబు అన్నారు. వట్టిచెరుకూరులో శనివారం నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం రమేష్‌బాబు, సర్పంచ్ ఏ విజయకుమార్, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యడపల్లి సత్యనారాయణ, వీఆర్ ఏఈ కిషోర్‌బాబు, ఈవోపీఆర్డీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

బటన్ నొక్కుడే తప్ప ప్రజలకు పథకాలు అందింది లేదు

● పల్లెపండుగ వారోత్సవాల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు


కొప్పర్రులో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బూర్ల

పెదనందిపాడు, అక్టోబరు, 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో బటన్ నొక్కడమే తప్ప ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కొప్పర్రు, ఉప్పలపాడు, నాగులపాడు, పెదనందిపాడు, వరగాని, ఏబీపాలెంలో శనివారం పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలనకు కృషిచేసి, ప్రతిఒక్కరినీ లక్షాధికారిని చేయడమే ధ్యేయమన్నారు. గ్రామాల్లో రైతులు ముందుకు వచ్చి 30ఎకరాలు భూమి ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో తొలివిడతగా 4కోట్లతో కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు, మరో రెండు నెలల్లో రెండో విడత నిధులు మంజూరు చేసి మరి కొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పి కేవలం ఒక్కబోరు వేసి దానికి కుళాయి వేశారని, ఇంటింటికీ తాగునీరు ఇవ్వలేదన్నారు. 8 గ్రామాల్లో ఎన్ఆర్జీఎస్ నిధులు 60లక్షలు, మండల పరిషత్ నిధులు 25లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా వేణు, జాష్టి రమేష్, పెంట్యాల శ్రీధర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, మోపర్తి చెంచయ్య, సంగండెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దార్ శంకర్‌బాబు, ఏఈ రవీంద్రబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగలు అందించాలి

మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే రామాంజనేయులుకు రైతు సంఘ నాయకులు సబ్సిడీపై శనగలు అందజేయాలని విన్నవించుకున్నారు. ఇప్పటికే రైతులు అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

తెలుగుయువత నేతకు ఎమ్మెల్యే పరామర్శ

పెదనందిపాడులో ఇటీవల అనారోగ్యానికి గురైన తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి సత్య హర్షను శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరావు, జంపని హనుమంతరావులు ఉన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. శనివారం రూరల్ మండలంలో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవంలో భాగంగా తురకపాలెం, మల్లవరం, తోకవారిపాలెం, దాసుపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, ఇమ్మడి లీలామల్లేశ్వరరావు. గంధం సురేష్, కల్లూరు శ్రీనివాసరావు, పంచుపర్తి రామశేషు, కల్లూరు అవినాష్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల ఉద్యమ కెరటం గుళ్ళపల్లి జ్యోత్స్న

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


జ్యోత్స్న సంస్మరణ సభలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ రాష్ట్ర నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరంతరం మహిళల హక్కుల కోసం, సమాజాభివృద్ధి, సామాజిక చైతన్యం కోసం పనిచేసిన జ్యోత్స్న హఠాన్మరణం చెందడం సమాజానికి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సామాజిక ఉద్యమకారిణి గుళ్లపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం మంగళగిరి బైపాస్‌లోని సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల బాధ్యులు, మహిళా సంఘాల నాయకులు, న్యాయవాదులు హాజరై జ్యోత్స్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జ్యోత్స్న ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న నిరంతరం పోరాటం చేశారన్నారు. సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావాలని ఆమె పరితపించారని, జ్యోత్స్న ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంబీవీకే చైర్మన్ పీ మధు, సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కే రామకృష్ణ, మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి టీ రజని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సార్వోత్తమ లైబ్రరీ కార్యదర్శి ఆర్ శారద, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్ ద్వారకనాథ్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణ్‌రెడ్డి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కేరళ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు థామస్ అబ్రహం, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ప్రజాశక్తి ఎడిటర్ బీ తులసీదాసు, జీ సురేంద్ర, జీ జితేంద్ర, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అమరావతికి పూర్వవైభవం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి
● 70 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న భూలక్ష్మి, జానకీదేవి

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభించడం హర్షణీయమని, కూటమి ప్రభుత్వ పాలనలో అమరావతి పూర్వవైభవం సంతరించుకోనుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా 65వ బ్యాచ్‌లో తాడేపల్లి పట్టణం, మండలానికి చెందిన 70 మంది మహిళలు కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం మంత్రి లోకేశ్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానకీదేవి మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం లోకేశ్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. కుట్టు శిక్షణ పొందడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంచి కలపూడి వైష్ణవి, తాడేపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొయ్యగూర మహాలక్ష్మి, అన్నే కుసుమ, మాజీ కౌన్సిలరు నిర్మల, ట్రైనర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మనపంచాయతీ అభివృద్ధిలో మనమే భాగస్వాములం


● జనసేన అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావు
● మండలంలో రూ.3.36కోట్లతో అభివృద్ధి పనులు


ఈమనిలో డొంక రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న చిల్లపల్లి శ్రీనివాసరావు, జబీన్, కేసంనేని శ్రీఅనిత తదితరులు

దుగ్గిరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మన భాగస్వామ్యంతో మన అభివృద్ధి మనమే చేసుకోవాలంటూ అభివృద్ధి పనులు చేపడుతన్నారని మంగళగిరి జనసేన అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. పల్లెల అభివృద్ధితోనే గ్రామస్వరాజ్యమనే నినాదంతో మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో రూ.3కోట్ల 36లక్షలతో జరిగిన రోడ్లు, కల్వర్టర్ల ప్రారంభోత్సవాలు శనివారం వరకు చేపట్టారు. ఈమని, చింతలపూడి, దుగ్గిరాల గ్రామపంచాయతీల పరిధిలో రూ.కోటితో ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఆరో రోజు ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో భాగంగా, దుగ్గిరాలలో రూ.55 లక్షలు, ఈమనిలో రూ.35 లక్షలతో రెండు రోడ్లకు, చింతలపూడిలో రూ.10 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసం నేని శ్రీఅనిత, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావులు ప్రసంగించారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయి చైతన్య, ఎంపీటీసీ గ్యారా నిర్మల, సర్పంచులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావ వ్యక్తీకరణ అలవర్చుకోవాలి

సినీ హాస్య నటుడు జెన్నీ


హాస్యనడుటు జెన్నీని సన్మానిస్తున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాడికొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు భావ వ్యక్తీకరణ అలవర్చుకోవాలని ప్రముఖ సినిమా హాస్య నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు జెన్నీ తెలిపారు. శనివారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ముఖాభినయం, భావ వ్యక్తీకరణపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెన్నీ ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్స్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. కేవలం మార్కులపైన మాత్రమే దృష్టి పెట్టకుండా వ్యక్తిత్వ వికాస అంశాలపై దృష్టి సారించాలన్నారు. దీంతో ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరి వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ కే చంద్రశేఖర్, అధ్యాపకు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో న్యాయమూర్తి తనిఖీలు


బాలుర వసతిగృహంలో తనిఖీల్లో పాల్గొన్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జీ పి.రాజశేఖర్

దుగ్గిరాల, అక్టోబరు 19: దుగ్గిరాలలోని బీసీ, ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జీ పి.రాజశేఖర్ శనివారం సందర్శించారు. న్యాయసేవాధికార సంస్థ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ డీ శ్రీనివాసులు ఆదేశానుసారం రికార్డులను, భవనస్థితి, వంటగదులు, మరుగుదొడ్లతో పాటు 48 అంశాలకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. లీగల్ సిబ్బంది షేక్ మహబూబ్, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత సోలా ముత్యాలరావు మృతి

● నివాళులర్పించిన వివిధ రాజకీయ పక్షాల నేతలు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు, తాడేపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు సోలా ముత్యాలరావు (56) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ తనువు చాలించారు. తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్లోని ఆయన నివాసంలో ముత్యాలరావు భౌతికకాయాన్ని సీపీఎంతోపాటు సీపీఐ, టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు జొన్నా శివశంకర్, డొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏవోఐలో స్వరపేటిక కేన్సర్‌కు అరుదైన శస్త్రచికిత్స

మంగళగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పునరావృత స్వరపేటిక కేన్సర్‌తో బాధపడుతున్న 47 ఏళ్ల వ్యక్తికి మంగళగిరిలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. డాక్టర్ ఇషాంత్ ఐనపూరి ఆధ్వర్యంలోని వైద్యబృందం శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఈ వివరాలను డాక్టర్ ఇషాంత్ మీడియాకు వివరించారు. రోగి ఆస్పత్రికి వచ్చిన సమయంలో అధిక కార్డియాక్ రిస్క్‌తోపాటు మెడపై పెద్ద పరిమాణంలో ఫైబ్రోసిస్ ఉందన్నారు. బాధితుడు 9 నెలల ముందు కీమో రేడియేషన్ థెరపీ చేయించుకున్నారని తెలిపారు. ఈ చికిత్సలో స్వరపేటికను తొలగిచడంతోపాటు మెడకు రెండు వైపులా నుంచి శోషరస కణుపులు, చుట్టుపక్కల కణజాలాన్ని చికిత్సలో భాగంగా తీసివేశారన్నారు. శస్త్రచికిత్స పూర్తయిన 40 రోజుల తరువాత గాయం పూర్తిగా నయమైందన్నారు. స్పీచ్ ఫంక్షన్‌ను పునరుద్ధరించడానికి ఆరు నెలల్లో వాయిస్ ప్రొస్థెసిస్ ప్రక్రియ చేయనున్నామని వెల్లడించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

మంగళగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలోని కుప్పురావు కాలనీలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా శనివారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అధికారులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ వీడాలి : సీఐ

ఫిరంగిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ వివాదాలకు దూరంగా ఉంటే గ్రామాలు శాంతి కపోతాలవుతాయని సీఐ రవీంద్రబాబు అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో వారధి కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. గంజాయి, మద్యానికి బానిసైన పిల్లలు తీవ్ర స్థాయికి వెళ్ళాక చేయి దాటి పోతుందని, కనుకనే పిల్లలను పరిశీలించాలన్నారు. మద్యపానానికి దూరంగా పిల్లలను ఉంచాలన్నారు. వ్యక్తిగత తగాదాలు పార్టీలకు పులమొద్దని ఆయన సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏటీఎం సెంటర్ల వద్ద వృద్ధులు, మహిళలు ఎలా మోసపోతారో వీడియో ద్వారా చూపించారు.

వైభవంగా శ్రీగంగానమ్మ ఉత్సవాలు


గంగానమ్మతల్లికి సమర్పించేందుకు సిద్ధం చేసిన అమ్మవారి సారె

దుగ్గిరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగానమ్మతల్లి ఉత్సవాలకు పెట్టింది పేరుగా నిలిచిన చిలువూరు శ్రీగంగానమ్మదేవతా ఉత్సవాలు తొలి రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం గ్రామస్తులు బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు, కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి సారెను గ్రామవీధుల్లో ఊరేగింపుగా తీసుకు వస్తుండగా మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి సారెను సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రంగిశెట్టి సురేష్‌బాబు, స్థానిక టీడీపీ నాయకులు తోటకూర సీతారామయ్య, షేక్ సాదిక్, గార్దెన్ వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, యడ్ల వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, మండవ మౌళయ్య, ఆలపాటి శ్రీనివాస్, కుర్రా సీతారామయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో రైతునేతలతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

రైతు నేతలతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సమావేశం

తుళ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) రాజధాని రైతు నేతలతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం సమావేశం అయ్యారు. ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు రాజధాని గ్రామాల్లో ల్యాండు పూలింగ్‌కి ఇవ్వని రైతులున్నారు. ల్యాండు పూలింగ్ ఇవ్వడానికి వారు సిద్ధంగా ఉన్నారా.. లేదా అని రైతు నేతలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులైన రంజన్‌వర్మ, సుబ్బారావులు అడిగి తెలుసుకున్నారు. వారికున్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తే తప్పకుండా ఇస్తారని చెప్పారు. ఇటీవల కొంత మంది రైతులు ల్యాండు పూలింగ్‌కు ఇచ్చారని, వారు అడిగిన ప్రదేశంలో పాట్లు కేటాయిస్తామని సీఆర్డీఏ చెప్పిందని అది అమలు జరిగితే, మిగిలిన రైతులు ల్యాండు పూలింగ్ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ సోషల్ వెల్ఫేర్ డీడీ బొర్రా శ్రీనివాసరావు డీసీలు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి


గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

తాడికొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారు తమ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం బడేపురం గ్రామంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ డిగ్రీ చదువుకున్న వారు పట్టభద్రుల ఓటు హక్కును నమోదు చేసుకోవటానికి ఆధార్‌కార్డు, ఓటు కార్డు, ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకొని వచ్చి నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని కూటమి నాయకులు పార్టీల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాయి కాంతికిరణ్, నీలాద్రి వెంకటేశ్వరరావు, కాలిశెట్టి రాజీవ్, కాలిశెట్టి మోహనరావు, మన్నె వెంకటేశ్వర్లు, పరిసపోగు లాజర్, మేకల మరియదాసు కొణతాల బుజ్జి పాల్గొన్నారు.

వసతి గృహం, పాఠశాల ఆకస్మిక తనిఖీ


ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఏఎంఎం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

పెదనందిపాడు, అక్టోబరు, 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల, వసతి గృహాలను బాపట్ల జిల్లా ఏఎంఎం కోర్టు ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం, రికార్డులను తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో పరిసరాలు, వంటపాత్రలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ శంకర్‌బాబు ఉన్నారు.

బాలికా విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

● ఏఎన్‌యూ ప్రొఫెసర్ కొండలరావు



బాలికా దినోత్సవ సదస్సులో పాల్గొన్న అధికారులు, గుడ్‌షెపర్డ్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికా విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతోపాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రతి పాఠశాలలో నాణ్యమైన ఆహారం అందిస్తూ మంచి సదుపాయాలను కల్పిస్తుందని ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ డి.కొండలరావు చెప్పారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి మండల పరిషత్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. కొండలరావు మాట్లాడుతూ ఇంతకు ముందు తరాల మహిళలకు లేనన్ని అవకాశాలు నేటి కాలంలో బాలికలు, మహిళలకు ఉన్నాయని, వాటిని సద్వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు పీ గీతాపద్మజ మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాముఖ్యతను గుర్తిస్తూ మగపిల్లలతో సమానంగా అన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత, మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్ర, డీఎల్ఎస్ఏ అడ్వొకేట్ కే.కాళిదాసు, గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ ఉదయ, స్నేహరాజ్, కారుమంచి రామారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పీ.రత్నకుమారి, శ్రీదేవి, రూబీ, వసుంధర, ఎస్ నాగమణి, బి.విజయలక్ష్మి, ఎ.పోతురాజు, జే ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాకు ఒకరికి బదులు మరొకరు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): **దొరికిపోయిన నకిలీ నిందితుడు**

రాజధాని ఉద్యమం- 2020 నేపథ్యంలో తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కోర్టు వాయిదాకు ఒకరికి బదులు మరొకరు హాజరై దొరికిపోయాడు. ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శరత్‌బాబు ఆదేశాలతో కోర్టు ఏపీ శివ సుబ్రహ్మణ్యం, నిందితుడిని నగరంపాలెం పోలీసులకు అప్పగించగా, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి సూచనలతో నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. పోలీసుల కథనం మేరకు, రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ నాడు బాపట్ల ఎంపీగా ఉన్న నందిగం సురేష్ స్వగ్రామం ఉద్దండరాయునిపాలెంలో రాజధాని రైతులు ర్యాలీ నిర్వహించారు. మూడు రాజధానులకు మద్దతిస్తున్న సురేష్ వర్గీయులు తమపై దాడికి వస్తున్నారంటూ వీరిపైకి రాళ్లతో దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో జరిగిన గొడవపై సురేష్ బంధువు పులి మాణిక్యరావు ఫిర్యాదు మేరకు తుళ్ళూరు పోలీసులు 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కోర్టులో శనివారం వాయిదా ఉంది. ఈ కేసులో 20వ నిందితుడు వెంకటేశ్వరరావు విదేశాలకు వెళ్ళడంతో ఆయన స్థానంలో అతని అన్న కుమారుడు సునీల్‌ను వెళ్ళమని చెప్పడంతో అతను వాయిదాకు హాజరయ్యాడు. ఒకరికి బదులు మరొకరు వాయిదాకు వచ్చినట్లు న్యాయమూర్తికి ఫిర్యాదు రావడంతో ఈ మేరకు ఆయన విచారణ చేశారు. నకిలీ నిందితుడు విచారణకు వచ్చినట్లు తేలింది. దీంతో అయ్యప్ప మాల ధరించిన నిందితుడు సునీల్‌ను నగరంపాలెం పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : ఏవో

కాకుమాను, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖాధికారి కిరణ్మయి అన్నారు. స్థానిక ఏవో కార్యాలయంలో శనివారం పురుగుమందులు, ఎరువుల దుకాణ యజమానులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కిరణ్మయి మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శుభనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

నేడు మండలంలో పల్లె పండుగ

తెనాలి రూరల్, అక్టోబరు 19: మండల గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11 గంటలకు కొలకలూరు, 11:45కు ఎరుకలపూడి, 12:30కు కఠెవరం, మధ్యాహ్నం 1:25కి సంగంజాగర్లమూడి, 2 గంటలకు అంగలకుదురు, 3 గంటలకు మల్లెపాడు, 3:40 గంటలకు జగ్గడిగుంటపాలెం గ్రామాలలో పాల్గొననున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేద్దాం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన

తెనాలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓట్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేద్దామని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ నియోజవర్గంలో పట్టభద్రులందరికీ ఓటు హక్కు కలిగి ఉండేలా వారిని చైతన్యవంతులను చేద్దామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, నన్నపనేని సుధాకర్, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, కొర్రపాటి శ్రీనివాసరావు, దివి అనిత, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణ, మాదల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో హుండీల లెక్కింపు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం కానుకల హుండీలను లెక్కించినట్లు ఆలయ ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. గడిచిన 90రోజుల కానుకల హుండీల ద్వారా రూ40,49,823, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.54,658, బంగారం 0.24.700 మి.గ్రా, వెండి 432గ్రాములు, వివిధ దేశాల విదేశీ కరెన్సీ వచ్చినవని దేవస్థాన ఉపకమిషనరు తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ఈవో సౌమ్య, సి.జి.జి.బ్యాంకు పెదకాకాని శాఖ కార్యనిర్వహణాధికారి బి.సువర్ణరాజు, బ్యాంకు సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'ఫెన్సింగ్' క్రీడా పోటీలు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో భాగంగా ఫెన్సింగ్ (పోరాట క్రీడ) పోటీలను వీవీఐటీ కళాశాలలో శనివారం నిర్వహించారు. మూడు విభాగాలలో స్త్రీ, పురుషులకు నిర్వహించిన ఈ పోటీలలో 16 కళాశాలల నుంచి 32మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ కే అంతర్ కళాశాలల టోర్నమెంట్ సెక్రటరీ జీపీ రాజు ప్రారంభించారు. ఈ పోటీలలో ఎస్.ఆర్.కే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎమ్.వెంకటేష్, కిట్స్ కళాశాలకు చెందిన పి.సృజన్‌సిన్హ, మహిళలలో చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కె.రత్నకుమారి ప్రతిభ కనబరిచి ప్రథమ విజేతలుగా నిలిచారు. మూడు విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను వీవీఐటీ అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.అరుణ్ కుమార్ ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.సౌరయ్య, ఎమ్.గిరిధర్ అభినందించారు.

కొబ్బరి బొండాల వ్యర్థాలు తరలింపు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొబ్బరి బొండాల వ్యర్థాలను తరలించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డ్ సమీపంలో రోడ్డుపై పోసిన కొబ్బరి బొండాల వ్యర్థాలను శనివారం మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులతో కొల్లూరుకి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదేశాల మేరకు ప్రజలకు, వాహనచోదకులకు ప్రమాదకరంగా మారిన కొబ్బరి బోండాల వ్యర్థాలను ఇటుక బట్టి నిర్వాహకుల కోరిన మీదట నాలుగు లారీలలో జేసీబీతో లోడుచేసి కొబ్బరి బోండాలను కొల్లూరుకు తరలించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేరువేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరికి గాయాలైన ఘటనలు పట్టణంలో చోటుచేసుకుంది. శనివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటలో నివసించే అందుకూరి వెంకట గోపీకృష్ణ ద్విచక్రవాహనంపై ఆలపాటి వంతెన మీదగా గంగానమ్మపేటకు వెళుతుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా ఘటనకు కారకుడైన ద్విచక్ర వాహనదారుడు అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో...

మండల పరిధిలోని కొలకలూరు గ్రామానికి చెందిన సయ్యద్ కరిముల్లా శనివారం పట్టణం నుంచి గ్రామానికి వెళ్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారుడు అతనిని గుద్దడంతో గాయపడ్డాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

డాక్టర్ సూర్యదేవర ఎన్నికపై హర్షం

చేబ్రోలు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్‌కు ప్రధాన సంపాదకుడిగా డాక్టర్ సూర్యదేవర విద్యాధర్ ఎన్నికపై ప్రెసిడెన్సీ స్కూల్ ప్రిన్సిపల్ వాసిరెడ్డి బన్‌బాబు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఇండియన్ ఫార్మసూటికల్ అసోసియేషన్ ఎన్నికలో ఫార్మసూటికల్ సైన్స్‌కు ప్రధాన సంపాదకుడిగా చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర్‌ను ఎన్నుకున్నారు.



కొలకలూరులో గోతులతో ఒక వైపే వెళుతున్న ట్రాఫిక్



ప్రధాన రోడ్లపై నీరు చేరటంతో ఇక్కట్లు పడుతున్న వాహనచోదకులు

అధ్వాన రోడ్లపై అవస్థలు

తెనాలి రూరల్, అక్టోబరు 19,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు వద్ద రోడ్డు అధ్వానంగా తయారై గుంతలమయంగా మారింది. శనివారం కురిసిన వర్షానికి ఆ గుంతల్లో నీరు చేరి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. రోడ్ల వెంబడి డ్రెయినేజీ నీరు కూడా ప్రధాన రోడ్డుపై గుంతల్లో చేరి కాలువలను తలపించడంతో ఎక్కడ గుంతలున్నాయో అంతుచిక్కక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు చవిచూడక తప్పలేదు. స్థానికులు పెద్ద గుంతలున్న ప్రాంతంలో చెట్లకొమ్మలను రోడ్లపై వేసి ప్రమాదహెచ్చరికగా ఏర్పాటు చేశారు. గత వైసీపీ పాలనలో రోడ్ల ఆలనా పాలనా పట్టించుకోకుండా రాష్ట్ర ఖజానాను ఖాళీ చేయడంతో కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టలేకపోయింది. ప్రస్తుతం ఆ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారి ప్రమాదఘంటికలు మోగిస్తోంది. చెట్ల కొమ్మలను అనుసరిస్తూ వాహనదారులు గుంతల్లో చిక్కుకోకుండా వాహనాలతో ముందుకు సాగారు. కూటమి ప్రభుత్వం కనీస మరమ్మతు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కోరిన అభివృద్ధి అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ములుకుదురు, నండూరు, వల్లభరావుపాలెం, ఉప్పరపాలెం గ్రామాలలో నిర్మించే సిమెంట్ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ భూమిపూజ చేశారు. ములుకుదురులో రూ.6లక్షలు, నండూరు గ్రామంలో రూ.7లక్షలు, వల్లభరావుపాలెంలో రూ.6.50లక్షలు, ఉప్పరపాలెంలో రూ.5.50 లక్షల వ్యయంతో ఈ రహదారులను నిర్మించనునట్లు చెప్పారు. ములుకుదురులో ఇంటింటికి చెత్త సేకరణ చేసే నూతన వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలాభివృద్ధి చిన్నబోయిందన్నారు. చెత్త పన్ను విధించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కానీ చెత్త సేకరించకుండా గ్రామాలలో పారిశుధ్య సమస్యలకు కారణమయ్యారని ఆరోపించారు. గ్రామాలలో ఐదేళ్లలో వైసీపీ పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గ్రామాలలో రహదారులు లేక మురుగు కాల్వలు నిర్మించక ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే పాలకులు మాత్రం దోపిడీనే పనిగా పెట్టుకుని పాలన సాగించారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, కూటమి పార్టీల నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, మొవ్వ వెంకటకృష్ణ, బుడ్డా వెంకట శివమ్మ, షేక్ షఫ్రూ, మిండాల శ్రీనివాసరావు, మదమంచి వీరయ్య చౌదరి, వేజండ్ల ఏకాంబరేశ్వరరావు, తాళ్లూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, తదితరులు పాల్గొన్నారు.



మృదుభాషిణికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, తదితరులు

మృదుభాషిణికి పలువురి నివాళి



అంత్యక్రియల్లో పాల్గొన్న మంద కృష్ణమాదిగ

తెనాలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన కరుణా నిలయం విద్యాసంస్థల అధినేత మేడూరి మృదుభాషిణి (93) మృతి బాధాకరమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని కొలకలూరు కురుణా నిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్ మేడూరి మృదుభాషిణి శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె భూస్థాపన కార్యక్రమం కొలకలూరు కరుణాలయం విద్యాసంస్థల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే ఆనందబాబు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పొన్నెకంటి దయాచారి, హైకోర్టు అడ్వకేట్ సీహెచ్ శోభారాణిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయినిగా ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం పనిచేసిన మృదుభాషిణి పలువురి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. మందకృష్ణమాదిగ మాట్లాడుతూ దళితజాతి అభ్యున్నతికి కరుణానిలయం విద్యాసంస్థల ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరిందని, విద్యాసంస్థల అధినేతగా మృదుభాషిణి పలువురికి మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. శోభారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగానే కాకుండా విద్యాసంస్థల కరస్పాండెంట్‌గా మృదుభాషిణి సేవలు అనిర్వచనీయమన్నారు. విద్యుత్‌శాఖ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పీబీ కరుణాకర్ మృదుభాషిణి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పొన్నెకంటి మంజుల,ఎ.షబాబ్, డాక్టర్ ప్రభావతి, పీబీ కరుణాకర్, ప్రత్యూష్, సుదీప్, సమతాచారి, డాక్టర్ పి.జె రత్నాకర్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు జె.వెంకటేశ్వరరావు, శశికళ, కరుణా నిలయ విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లలో వ్యర్థాలను వేయవద్దు

అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రెయిన్‌లలో, మురుగు కాలువలలో వ్యర్థాలను వేయవద్దని పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. శనివారం పట్టణంలోని 25, 26వ వార్డులలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను డ్రెయిన్‌ల వెంట పెరిగిన పిచ్చి చెట్లను, డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలవల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం 27వ వార్డులోని పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు నజీర్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గంగాధర్ రావు సంతాప సభలో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

గంగాధరరావు సేవలు చిరస్మరణీయం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామపంచాయతీ సర్పంచిగా, రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి వల్లూరి గంగాధరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. దివంగత సీపీఐ నేత వల్లూరి గంగాధరరావు 18వ వర్ధంతి సభను శనివారం మండల కేంద్రమైన పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రి ఎదురుగా స్థూపం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడుతూ వల్లూరు గంగాధరరావు 1959, 1970 సంవత్సరాలలో రెండు పర్యాయాలు పెదకాకాని సర్పంచిగా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ గంగాధరరావు కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ముందుగా స్థూపం వద్ద సీపీఐ ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లి రంగారెడ్డి, గంగాధర్‌రావు కుమారుడు వల్లూరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిగా డాక్టర్ అనిల్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న డాక్టర్ సాంబశివుడు, ప్రియాంక, విజయలక్ష్మి తదితరులు

ఐఎంఏ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ అనిల్ కుమార్

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ తెనాలి శాఖకు నూతన అధ్యక్షుడిగా డాక్టర్ అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం ఐఎంఏ తెనాలి శాఖకు 2024 -2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్లు కె అనిల్‌కుమార్, వి పావని ప్రియాంక, జి మధుప్రభాకర్‌లు ఎన్నికైనారు. సహాయ కార్యదర్శి కోశాధికారిలుగా కె శ్యాంప్రసాద్, చందు ఉదయ భాస్కర్‌లు ఎన్నికైనారు. ఎన్నికల నిర్వాహకులుగా డాక్టర్‌లు చందు సాంబశివుడు, జి నాగేశ్వరావు, ఎంవీ సత్యనారాయణలు ఎన్నికలను నిర్వహించారు.

అన్ని పరీక్షలు చేశాకే ఆలయాల్లో నెయ్యి వాడకం

● దేవదాయ కమిషనర్ సత్యనారాయణ



వైకుంఠపురం ఆలయంలో కమిషనర్‌కు ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాలలో అన్ని పరీక్షలు చేశాకే నెయ్యి వినియోగం జరుగుతుందని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరామసత్యనారాయణ చెప్పారు. తెనాలి వైకుంఠపురం శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం ఆయన దర్శించుకున్నారు. దేవదాయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 6ఏ కింద ఉన్న ప్రముఖ ఆలయాలు అన్నింటిలో 14వేల టన్నుల నెయ్యి అవసరమని సహకార సంఘాలు, బ్రాండెడ్ సంస్థల నుంచి మాత్రమే నెయ్యి కొనుగోలు చేస్తున్నామని టెండర్ విధానంలో కూడా మార్పులు చేశామన్నారు. ఆలయాలలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు గాను స్వయం ప్రతిపత్తితో వ్యవహరించేలా వైదిక కమిటీలను ప్రభుత్వం నియమించబోతుందన్నారు. సంస్కృతి సంప్రదాయాలు కాపాడేలా దేవదాయ శాఖ వ్యవహరిస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలోని ఆలయాలలో ధూప, దీప నైవేద్యాలు నిర్వహించే అర్చకులకు రూ.5వేలు వేతనం పెంచినట్లు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ కె.బి.శ్రీనివాసరావు, జిల్లా కమిషనర్ మాధవి, ఈవో అనుపమ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

సమాజ సేవలో రోటరీ ముందంజ: శరత్ చౌదరి



టిడ్కో ఇళ్ల వద్ద మొక్కలు నాటుతున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి, కమిషనర్ తదితరులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అవసరమైన విద్య వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో రోటరీ క్లబ్ ముందంజలో నిలుస్తున్నాయని క్లబ్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి అన్నారు. శనివారం పొన్నూరు పట్టణంలో రోటరీ గవర్నర్ పర్యటించారు. ఈ సందర్భంగా నిడుబ్రోలు టిడ్కో గృహ సముదాయాల వద్ద మొక్కలు నాటారు. పట్టణంలోని పల్సస్ మర్చంట్స్ హాల్‌లలో జరిగిన సమావేశంలో గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో రోటరీ క్లబ్ చేసిన కృషి ఫలితంగా పోలియో మహమ్మారిని పారద్రోలినట్లు చెప్పారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలకు కృషి చేశారన్నారు. విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సేవలను అందిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవిరాకేష్‌దేవ్, నన్నపనేని బాలకృష్ణ, పాములపాటి రవీంద్రనాథ్, జీఎంఎస్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, తానికొండ లక్ష్మీనారాయణ చౌదరి, పాములపాటి సాయికృష్ణ, బండారుపల్లి శ్రీనివాసరావు, పొన్నగంటి వాసు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్లు పంపిణీ

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజలో ఉంటుందని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి చెప్పారు. పట్టణంలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నిర్మించతలపెట్టిన డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్‌లకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. తెనాలి డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 25 వీల్‌చైర్లు, ముగ్గురు పేదలకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దాతల సహకారంతో విస్తృత స్థాయిలో సేవలు అందిస్తున్న క్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. సోమవరపు వెంకటశివరామప్రసాద్, రత్నప్రభాకర్, శివరంజని, పెరుమాళ్లు, చినకోటిరెడ్డి, మురళీకృష్ణ, రమేష్‌కుమార్, ఈదర వెంకటపూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ రవీంద్రనాథ్, చేతన్‌రాజ్, ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి



రాజధాని నిర్మాణానికి రూ. 11 వేలు అందజేస్తున్న బండారుపల్లి సావిత్రి

అమరావతి నిర్మాణానికి వృద్ధురాలి విరాళం

పొన్నూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి వల్లభరావుపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు బండారుపల్లి సావిత్రి రూ.11వేల నగదు విరాళంగా అందచేసింది. శనివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వల్లభరావుపాలెం గ్రామానికి విచ్చేయగా సావిత్రి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి నగదు చెక్కును అందచేసింది. సావిత్రి తనకు వచ్చే పెన్షన్ నగదును రాజధాని నిర్మాణానికి అందచేసింది. ఈ సందర్భంగా వృద్ధురాలి సావిత్రిని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌తోపాటు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

దూరప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచాలి

● డయల్ యువర్ డీఎంలో పలువురి విజ్ఞప్తి



ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి

పొన్నూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచాలని ఆర్టీసీ డిపో మేనేజర్ టి. అజిత కుమారికి డయల్ యువర్ డీఎంకు ఫిర్యాదులు అందాయి. శనివారం ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణానికి చెందిన పలువురు ఫోన్ ద్వారా ఫిర్యాదులు తెలియజేశారు. పొన్నూరు డిపో నుంచి నగరం మీదుగా రేపల్లెకు, పిడుగురాళ్ళ, మచిలీపట్నం, పెదనందిపాడు ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపాలని కోరారు. అలాగే సింహపురి రైలు లింక్ సర్వీస్‌గా బాపట్లకు బస్సు సర్వీస్ నిర్వహించాలని ఉదయం 7 గంటల సమయంలో నిజాంపట్నంకు బస్సు సర్వీస్ నడపాలని, రద్దీ సమయంలో పొన్నూరు, గుంటూరు మధ్య సర్వీసులు పెంచాలని ఫోన్ల ద్వారా ఫిర్యాదులు అందచేశారు. డిపో మేనేజర్ అజితకుమారి మాట్లాడుతూ పట్టణ వాసులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించనునట్లు చెప్పారు.

పంప్ హౌస్‌లో పరిశుభ్రత పాటించాలి: కమిషనర్



పంప్ హౌస్‌లో మోటర్లు పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు తదితరులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించే పంప్ హౌస్ ప్రాంతంలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు సిబ్బందిని ఆదేశించారు. శనివారం నిడుబ్రోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ప్రాంగణంలోని వాటర్ పంప్ హౌస్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ట్యాంక్ పరిసరాలలో నీటి కాలుష్యానికి కారణమైన చెత్త ఉండటానికి వీలులేదన్నారు. పైప్‌లైన్లు మోటార్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. నిత్యం క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు సరఫరా చేయాలని, తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన వేజండ్ల విద్యార్థులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థుల ఎంపిక

చేబ్రోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల జిల్లా పరిషత్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి విజయశ్రీ తెలిపారు. శనివారం విద్యార్థులు అభినందన కార్యక్రమం పాఠశాలలో జరిగింది. పాఠశాలకు చెందిన మట్టుపల్లి సుమశ్రీ బింగినపల్లి మనీషా, చల్లగిరి గీతామాధురి, మట్టుపల్లి జయసంజనా, పఠాన్ షాహేదా, జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

అక్టోబరు 21 నుంచి 23 వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులను కోటి అందచేశారు.